జ్ఞాని పురుష్ దాదా భగవాన్ నిర్వచించిన

# నేను ఎవరు?



మిమ్మల్ని మీరే ఎరుగని స్థితిలో ఎంతకాలం ఉంటారు?

“అసలు నేనెవరు?”

ఇదే తెలుసుకోవలసిన అవసరం ఉంది

Telugu

జ్ఞాని పురుష్ దాదా భగవాన్ నిర్వచించిన

# నేను ఎవరు?

మూల గుజరాతి సంకలనం - డా.నీరు బెహన్ అమీన్

తెలుగు అనువాదం - మహాత్మగణం

**ప్రకాశకులు** : అజీత్ సి.పటేల్
దాదా భగవాన్ విజ్ఞాన్ ఫౌండేషన్
1, వరుణ్ అపార్ట్మెంట్, 37,శ్రీమాలి సొసైటీ
నవరంగ్‌పురా పోలీస్ స్టేషన్ ఎదురుగా,
నవరంగ్‌పురా, అహ్మదాబాద్ – 380009
గుజరాత్, భారత్
**ఫోన్:** + 91 79 3500 2100

© Dada Bhagwan Foundation,
5, Mamta Park Society, B\h. Navgujarat College,
Usmanpura, Ahmedabad -380014, Gujarat, India.
**Email :** info@dadabhagwan.org
**Tel :** + 91 79 3500 2100

**All Rights Reserved. No part of this publication may be shared, copied, translated or reproduced in any form (including electronic storage or audio recording) without written permission from the holder of the copyright. This publication is licensed for your personal use only.**

**First Edition** : 1500 Copies (October 2015)

**Second Edition** : 500 Copies (June 2024)

**భావ మూల్యం** : 'పరమ వినయం', మరియు "నాకు ఎంతమాత్రం తెలియదు. అదే భావన

**Price** : Rs. 40

**ముద్రిక** : అంబా మల్టి ప్రింటింగ్
B–99, ఈలెక్ట్రానిక్స్ GIDC
క–6, రోడ్డు సెక్టర్–25
గాంధీనగర్ – 382044
గుజరాత్, India
**ఫోన్:** +91 79 3500 2142

**ISBN/eISBN** : 978-93-91375-77-5

**Printed in India**

# త్రిమంత్రం

(సర్వ విఘ్న నివారణ చేసే మంత్రం)



నమో అరిహంతాణం



నమో సిద్ధాణం

నమో ఆయరియాణం



నమో ఉవజ్ఝాయాణం

నమో లోయే సవ్వ సాహూణం

ఏసోపంచణమోక్కారో,

సవ్వాపావప్పణాసణో

మంగళా ణం చ సవ్వేసిం,

పడమం హవయీ మంగళం

ఓం నమో భగవతే వాసుదేవాయ

ఓం నమో శివాయ

జై సచ్చిదానంద



# దాదా భగవాన్ ఎవరు?

అది జూన్ 1958 లో ఒక సాయంత్రం సమయం సుమారు 6:00, ప్రదేశం రద్దీగా ఉన్న సూరత్ పట్టణ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫార్మ్ నం. 3.లో బెంచీ మీద కూర్చునివున్న శ్రీ అంబాలాల్ మూల్జీ భాయ్ పటేల్ అనే దేహమందిరంలో, ప్రకృతిపరంగా, అక్రమ రూపంలో, ఎన్నో జన్మలుగా వ్యక్తమయ్యేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్న 'దాదా భగవాన్' పూర్ణ రూపంలో ప్రకటితమయ్యారు, ఆధ్యాత్మిక అద్భుతంలా. ఒక గంట సమయంలోనే ఆయనకు విశ్వ దర్శనం అయింది. "నేనెవరు? భగవంతుడు ఎవరు? విశ్వాన్నంతా ఎవరు నడిపిస్తున్నారు? కర్మ అంటే ఏమిటి? ముక్తి అంటే ఏమిటి?" ఇలాంటి ప్రపంచంలో ఆధ్యాత్మిక ప్రశ్నలన్నిటికీ సమాధానం వచ్చింది. ఈ విధంగా దైవం, విశ్వానికి సంబంధించిన ఒక అద్వితీయమైన పూర్ణ స్వరూప దర్శనం కావించింది, దాని ఫలస్వరూపమే శ్రీ అంబాలాల్ మూల్జీ భాయ్ పటేల్, గుజరాత్‌లోని చరోతర్ క్షేత్రంలోని భాదరణ్ గ్రామంలో పాటీదార్, ఒక కాంట్రాక్ట్ పని చేసే వ్యక్తి, అయినా కూడా సంపూర్ణ వీతరాగ పురుషుడు.

"వ్యాపారంలో ధర్మం పాటించాలి కాని, ధర్మాచరణలో వ్యాపారం చేయగూడదు" అనే సిద్ధాంతంతోనే ఆయన జీవితమంతా గడిపారు. ఆయన ఎప్పుడూ ఎవరి దగ్గరి నుంచీ డబ్బు తీసుకోలేదు సరికదా తన ఆదాయం నుంచే తీర్థయాత్రలు చేసే భక్తులకు ఆర్థిక సహాయం చేసారు.

ఆ విధంగా ఆయనకు కేవలం రెండు గంటలలోనే సిద్ధించిన అద్భుతమైన జ్ఞానాన్ని ఉపయోగించి, ఆయన ఎందరో ముముక్షువులకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించారు. దాన్ని ఆయన అక్రమ మార్గం అని అన్నారు. అక్రమ అంటే ఒక క్రమం లేని అర్థం. క్రమం అంటే ఒక మెట్టు పైన మరో మెట్టుని క్రమంగా ఎక్కుతూ వెళ్ళటం. అక్రమ మార్గమంటే షార్ట్‌కట్‌లో లిఫ్ట్ ద్వారా పైకి చేరుకోవటం.

ఆయన “దాదా భగవాన్ ఎవరు” అన్న రహస్యాన్ని స్వయంగా చెప్తూ, “మీ ముందు కనిపిస్తున్న ఈ ఆకారం దాదా భగవాన్ కాదు. ఈయన ఎ.ఎమ్.పటేల్. మేము ఒక జ్ఞానపురుషుడను, లోపల ప్రకటితమైనది దాదా భగవాన్. దాదా భగవాన్, 14 లోకాలకు నాధుడు. ఆయన మీలో కూడా ఉన్నాడు. అందరిలోనూ ఉన్నాడు. మీలో అవ్యక్త రూపంలో ఉన్నాడు, నాలో సంపూర్ణ రూపంలో వ్యక్తమై ఉన్నాడు. ఆ దాదా భగవాన్ గారికి నేను కూడా ప్రణామం చేస్తాను”

# ఆత్మజ్ఞానానికి ప్రత్యక్ష లింక్

"నేను నా చేతులతో కొందరికి సిద్ధిని ప్రసాదించబోతున్నాను. నా తర్వాత ముందుకు నడిపేవాళ్ళు ఉండాలి కదా! నా తర్వాత కూడా మనుషులకు మార్గం చూపించేవాళ్ళుండాలి కదా!"

–దాదాశ్రీ

పరమ పూజ్య దాదాశ్రీ పల్లెపల్లెకు దేశవిదేశాలలో తిరుగుతూ ముముక్షువులకు సత్సంగం, ఆత్మజ్ఞాన ప్రాప్తిని కలిగిస్తూవచ్చారు. వీరు తమ జీవితకాలంలోనే పూజ్య డా.నీరు బెహన్ అమీన్ (నీరూ మా) కి ఆత్మజ్ఞానాన్ని కలిగించి జ్ఞానసిద్ధిని ప్రసాదించారు. దాదాశ్రీ దేహాన్ని చాలించిన తర్వాత నీరూ మా, ముముక్షువులకు సత్సంగం, ఆత్మజ్ఞాన ప్రాప్తిని నిమిత్త భావనతో చేస్తూవస్తున్నారు. పూజ్య దీపక్ భాయ్ దేశాయ్‌కి దాదాశ్రీ, సత్సంగాన్ని నిర్వహించే సిద్ధిని ప్రసాదించారు. నీరు మా సమక్షంలోనే, ఆమె ఆశీర్వాదంతోనే పూజ్య దీపక్ భాయి దేశవిదేశాలలో ఎన్నో ప్రాంతాలకు వెళ్ళి, ముముక్షువులకు ఆత్మజ్ఞాన ప్రాప్తిని కలిగించి వచ్చారు. ఆ పని ఇప్పటికీ నీరూమా దేహాంతం తర్వాత కూడా కొనసాగుతూనేవుంది. ఆత్మజ్ఞాన ప్రాప్తి తర్వాత ఎందరో ముముక్షువులు ప్రపంచంలో ఉంటూ, తమ తమ బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తూ, ముక్త పురుషులుగా ఆత్మానందాన్ని అనుభవిస్తున్నారు.

ఈ గ్రంథంలో ముద్రితమైన వాణి, మోక్షార్థుల మార్గదర్శనంలో ఎంతో ఉపయోగకరం. కానీ, మోక్షప్రాప్తి కోసం ఆత్మజ్ఞానాన్ని పొందటం అవసరం. అక్రమ మార్గంలో ఆత్మజ్ఞానాన్ని పొందేందుకు ఇప్పటికీ మార్గం తెరిచేవుంది. దీపకళిక మరో దీపాన్ని వెలిగించినట్లుగానే, ప్రత్యక్షంగా ఆత్మజ్ఞాని నుంచే ఆత్మజ్ఞాన ప్రాప్తిని కలిగించుకొని తన ఆత్మను జాగృతం చేసుకోవచ్చు.

# విన్నపం

జ్ఞాని పురుషులు పూజ్య దాదాభగవాన్ శ్రీముఖం నుంచి వెలువడ్డ ఆధ్యాత్మిక, వ్యావహారిక జ్ఞానానికి సంబంధించిన వాణిని రికార్డ్ చేసి, దానిని సంకలన సంపాదకీయాలతో పుస్తక రూపంలో ప్రచురించటం జరుగుతుంది. వివిధ విషయాల మీద వెలువడిన అద్భుతమైన సారస్వత సంకలనాన్ని ఈ పుస్తకాలలో చూస్తారు. అవి కొత్తగా చేరిన పాఠకులకు కూడా ఒక వరంలా పనిచేస్తుంది.

ఈ అనువాదాలలో, స్వయంగా దాదాజీ వాణిలాగానే వినిపించే విధంగా ఉండేందుకు విశేష ప్రయత్నాలు జరిగాయి. ఈ కారణంగా కొన్ని సందర్భాలలో తెలుగు వ్యాకరణానికి భిన్నంగా ఉందనిపించవచ్చు. కానీ, దాని వెనుకనున్న లక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది.

ఈ పుస్తకంలో ఎన్నో చోట్ల నిఘంటువులలోని వాక్యాలు కాక, దాదాశ్రీ ఉపయోగించిన వ్యాక్యాలను ఎక్కువ స్పష్టత రావటం కోసం తీసుకుని రాయటం జరిగింది. అందువలన కొన్ని చోట్ల ఇంగ్లీషు పదాలనే దీనికి మూలమైన హిందీ పుస్తకంలో హిందీ పదాలలా రాయటం జరిగింది. అదే దాదాశ్రీ శ్రీముఖం నుంచి వెలువడిన గుజరాతీ మాటలనైతే యథాతథంగా ఇటాలిక్స్‌లో రాయటం జరిగింది. ఎందుకంటే, వాటికి సమానమైన, వాటి పూర్తి అర్థాన్నిచ్చే హిందీ పదాలు లేవు కనుక. కాకపోతే వాటికి దగ్గర్లో ఉన్న హిందీ పదాలను ఆ పుస్తకాలలో చివర్లో ఇచ్చారు.

ఒక జ్ఞాని వాక్యాలను హిందీలో అనువాదం చేయటానికి వారి వంతు ప్రయత్నం చేసామని చెప్తున్నారు. అదే ప్రయత్నం తెలుగులో కూడా జరిగింది. కాకపోతే దాదాశ్రీ అందించిన ఆత్మజ్ఞానాన్ని యథాతథంగా పొందాలంటే, దాన్ని గుజరాతీలో చదివితేనే ఆ పని పూర్తిగా జరుగుతుంది. జ్ఞానపు లోతులలోకి వెళ్ళాలంటే, ఆ వాక్యాలలోని మర్మాన్ని పూర్తిగా అవగతం చేసుకోవాలంటే గుజరాతీ భాషను నేర్చుకోమని మేమివ్వగల సలహా.

అనువాదంలోని లోపాలకు మమ్మల్ని క్షమించవలసిందిగా ప్రార్థన.

# సంపాదకీయం

జీవితంలో ఏమి ఎదురైనా, పూర్తిగా దాని రియలైజేషన్ చేయకుండా మనిషి దాన్ని సొంతం చేసుకోడు. అన్నిటి రియలైజేషన్ చేయటం జరిగింది కాని, కేవలం 'సెల్ఫ్' రియలైజేషన్ చేసుకోవటమే జరగలేదు. అనంత జన్మలుగా ఈ "నేనెవరు?" అన్నది తెలుసుకోవటమే జరగటంలేదు. అందుకే ఇలా మళ్ళీ మళ్ళీ దారితప్పి తిరగటం అంతమవటం లేదు. దాన్నెలా తెలుసుకోవటం?

ఏ వ్యక్తయితే తనను తాను తెలుసుకుంటాడో, ఆ వ్యక్తి మాత్రమే ఇతరులను కూడా తమను తాము తెలుసుకునేటట్టుగా చేయగలుగుతాడు. అలాంటి అభివృద్ధి అంటే స్వయం జ్ఞానే. జ్ఞాని పురుష్ అంటే ఈ ప్రపంచంలో ఏమీ తెలుసుకోవటానికి కాని, చెయ్యటానికి కాని మిగిలివుండనివారు. అటువంటి జ్ఞాని పురుష్ పరమ పూజ్య దాదాశ్రీ, ఈ కాలంలో మన మధ్యకు వచ్చి మనదైన భాషలో, మనం అర్థం చేసుకోగల సరళమైన భాషలో ప్రతివారి మౌలికమైన ప్రశ్నయిన "నేనెవరు?" కి సమాధానాన్ని సహజరూపంలో అందించారు.

అంతేకాదు, ఈ ప్రపంచం అంటే ఏమిటి? ఇది ఎలా నడుస్తూవుంది? దీనికి కర్త ఎవరు? భగవంతుడంటే ఎవరు? మోక్షమంటే ఏమిటి? జ్ఞాని పురుష్ అని ఎవరిని అంటారు? సీమంధర స్వామి ఎవరు? సంత్, గురు, జ్ఞాని పురుష్‌ల మధ్య తేడా ఏమిటి? జ్ఞానిని గుర్తించటం ఎలా? జ్ఞాని ఏం చెయ్యగలుగుతారు? అందులో కూడా పరమ పూజ్య దాదాశ్రీ అక్రమ మార్గమేమిటి? మోక్షమార్గంలో మెట్టు మీద మెట్టు ఎక్కుతూ అనంత జన్మల నుంచి వస్తూనేవున్నాం కాని, లిఫ్ట్ (ఎలివేటర్) వంటిదేమైనా మోక్ష మార్గంలో ఉంటుందా? అక్రమ మార్గంలో ఈ కాలంలో, ప్రపంచంలో ఉంటూనే మోక్షముంటుందా, మోక్ష ప్రాప్తి జరుగుతుంది అన్నదాని మీద సంపూర్ణ జ్ఞానం, సరైన దిశల ప్రాప్తి పరమ పూజ్య దాదాశ్రీ కలిగించారు.

"నేనెవరు" అన్నది తెలుసుకున్న తర్వాత ఎటువంటి అనుభూతి కలుగుతుంది, ప్రాపంచిక వ్యవహారాలను నిర్వర్తిస్తూనే సంపూర్ణమైన నిర్లిప్తతతో ఆత్మస్థితి అనుభూతిలో ఉండిపోగలుగుతారు. ఆధి-వ్యాధి, ఉపాధిలలో కూడా నిరంతరం స్వ-సమాధిలో ఉండగలుగుతారు. అక్రమ విజ్ఞాన ప్రాప్తి జరిగిన తర్వాత వేలాదిమంది మహాత్ములకు అటువంటి అనుభవం కలిగింది. వీటన్నిటి ప్రాప్తి కోసం, ప్రస్తుత సంకలనంలో, మోక్షార్థులకు మోక్షమార్గంలో దీపస్థంభంలా దిశానిర్దేశం చేయాలన్నదే ఆశయం.

**-డా. నీరూ బెహన్ అమీన్**

దాదా భగవాన్ నిర్వచించిన

# నేను ఎవరు?

## 1) నేను ఎవరు?

### నా పేరు, నేను, వేరువేరా?

**దాదాశ్రీ:** మీ పేరేమిటి?

**ప్రశ్నకర్త:** నా పేరు చందూలాల్.

**దాదాశ్రీ:** వాస్తవంలో మీరు చందూలాలా?

**ప్రశ్నకర్త:** ఔను.

**దాదాశ్రీ:** చందూలాలైతే మీరు. చందూలాల్ మీ పేరు కాదా? మీరు స్వయంగా చందూలాలా లేక మీ పేరు చందూలాలా?

**ప్రశ్నకర్త:** అది నా పేరు.

**దాదాశ్రీ:** ఆ. మరి 'మీరు' ఎవరు? 'చందూలాల్' మీ పేరైతే, 'మీరు' ఎవరు? మీ పేరు, మీరు వేరు వేరు కాదా? మీరు మీ పేరుకి భిన్నమైతే, మరి 'మీరు' ఎవరు? నేను చెప్పదలచుకున్నది మీకు అర్థమౌతోంది కదా. 'ఇది నా కళ్ళజోడు' అన్నపుడు నేను, ఈ కళ్ళజోడు వేరువేరు ఔతాయి కదా. అదే విధంగా మీరు, మీ పేరు వేరని అనిపించటం లేదా?

ఉదాహరణకు దుకాణం పేరు 'జనరల్ ట్రేడర్స్' అని పెట్టినట్లయితే తప్పేం లేదు. కానీ దాని యజమానిని మనం, 'ఓయ్ జనరల్ ట్రేడర్స్, అలా రా' అంటే ఆ యజమాని ఏమంటాడు, 'నాపేరు జయంతి లాల్. జనరల్ ట్రేడర్స్ నా దుకాణం పేరు' అని కదా. అంటే దుకాణం పేరు వేరు, దుకాణం యజమాని వేరు, సరుకు వేరు, అన్నీ వేరువేరు కదా? ఏమనిపిస్తోంది మీకు?

**ప్రశ్నకర్త:** ఔను నిజమే.

**దాదాశ్రీ:** కానీ, ఇక్కడికి వచ్చేటప్పటికి, 'లేదు, నేనే చందూలాల్' అంటున్నారు. అంటే దుకాణం బోర్డూ నేనే, యజమానిని నేనే. మీరు చందూలాల్ అనేది మిమ్మల్ని గుర్తించటానికి సాధనం.

## ప్రభావం పడిందా? అయితే ఆత్మ స్వరూపులు కారు

మీరు చందూలాల్ కానేకాదు అని కూడా అనుకోవటానికి లేదు. మీరు చందూలాలే కాని, 'బై రిలేటివ్ వ్యూ పాయింట్' (వ్యవహారిక దృష్టిలో), యు ఆర్ చందూలాల్, ఈజ్ కరెక్ట్.

**ప్రశ్నకర్త:** నేను ఆత్మని. కానీ, నా పేరు చందూలాల్.

**దాదాశ్రీ:** ఔనుకానీ, ఇప్పుడు ఎవరైనా 'చందూలాల్' ని తిట్టినట్లయితే మీమీద ప్రభావం పడుతుందా?

**ప్రశ్నకర్త:** ప్రభావం పడుతుంది.

**దాదాశ్రీ:** అంటే మీరు 'చందూలాల్', ఆత్మ కాదు. ఆత్మ అయితే మీమీద ప్రభావం పడకూడదు. ప్రభావం పడినట్లయితే మీరు చందూలాలే.

చందూలాల్ పేరుతో ఎవరైనా తిట్టినట్లయితే మీరతన్ని పట్టుకుంటారు. చందూలాల్ పేరు మీద ఎవరైనా ఎక్కువతక్కువ మాట్లాడితే మీరు గోడకి చెవు ఆనించి మరీ వింటారు. 'అన్నా, గోడ మీకేం చెప్తోంది?' అని నేను అడిగితే మీరు, 'కాదు, గోడ కాదు, లోపల నా గురించి మాట్లాడుకుంటున్నారు. అది వింటున్నాను" అంటారు. అయితే ఎవరి గురించి మాటలు నడుస్తున్నాయి?

అని అడిగితే 'చందూలాల్' గురించి అంటారు. కానీ, మీరు చందూలాల్ కాదు కదా. మీరు ఆత్మే అయినట్లయితే, చందూలాల్ మాటలను మీరు పట్టించుకోరు.

**ప్రశ్నకర్త:** వాస్తవానికైతే 'నేను ఆత్మనే' కదా?

**దాదాశ్రీ:** మీరింకా ఆత్మ అవలేదు కదా! చందూలాలే కదా? 'నేను చందూలాల్‌ని' అన్నది మీరు ఆరోపించుకున్న భావం. మీలో, 'నేను చందూలాల్‌ని' అనే బిలీఫ్ (నమ్మకం) ఏర్పడింది. అది రాంగ్ బిలీఫ్.

## 2) బిలీఫ్ - రాంగ్, రైట్ (తప్పు, ఒప్పు)

## ఎన్నో రాంగ్ బిలీఫ్‌లు

'నేను చందూలాల్‌ని' అన్న మీ ఈ నమ్మకం, రాత్రి నిద్రలో కూడా పోని బిలీఫ్! ఇంకా, పెళ్ళి చేసి మీకు చెప్తారు, 'నువ్వు ఈ స్త్రీకి భర్త' అని. అందువలన మనం ఆ భర్త హెూదాని నమ్ముతాము. ఆ తర్వాత, 'నేను ఈమె భర్తను, భర్తను' అంటుంటారు. ఎవరైనా ఎప్పుడూ భర్తగానే ఉంటారా? డైవర్స్ అయిపోతే రెండవ రోజు ఆమెకి భర్త అవుతారా? అంటే ఈ రాంగ్ బిలీఫ్ అంతా తిష్ఠవేసుకునివుంది.

కనుక, 'నేను చందూలాల్‌ని' అనేది రాంగ్ బిలీఫ్. ఆ తర్వాత 'నేను ఈ స్త్రీకి భర్తను' అన్నది రెండవ రాంగ్ బిలీఫ్. 'నేను వైష్ణవుడను' అనేది మూడవ రాంగ్ బిలీఫ్. 'నేను వకీలుని' అనేది నాల్గవ రాంగ్ బిలీఫ్. 'ఈ అబ్బాయికి తండ్రిని' అనేది ఐదవ రాంగ్ బిలీఫ్. 'ఇతనికి మామను' అనేది ఆరవ రాంగ్ బిలీఫ్. 'నేను తెల్లగా ఉంటాను' ఇది ఏడవ రాంగ్ బిలీఫ్. 'నేను నలభై ఐదు సంవత్సరాల వయసువాడను' అన్నది ఎనిమిదవ రాంగ్ బిలీఫ్. 'నేను ఇతని వ్యాపార భాగస్వామిని' అనేది తొమ్మిదవ రాంగ్ బిలీఫ్. మీరు, 'నేను ఇన్‌కమ్‌ట్యాక్స్ పేయర్‌ని' అని అంటే అది కూడా రాంగ్ బిలీఫ్ అవుతుంది. ఇలాంటి రాంగ్ బిలీఫ్‌లు ఎన్ని తిష్ఠవేసాయో?

## నేను స్థాన పరివర్తనం

'నేను చందూలాల్‌ని' అన్నది అహంకారం. ఎందుకంటే 'నేను' అన్నది లేనిచోట 'నాది' అనేది ఆరోపించుకున్నారు. దీన్నే అహంకారం అంటారు.

**ప్రశ్నకర్త:** 'నేను చందూలాల్‌ని' అంటే అందులో అహంకారం ఎక్కడి నుంచి వచ్చింది? 'నేను ఇలాంటివాడిని, అలాంటివాడిని' అంటే వేరు కానీ, సహజ భావంతో అన్నపుడు అందులో అహంకారం ఎక్కడి నుంచి వచ్చింది?

**దాదాశ్రీ:** సహజభావంతో అంటే అహంకారం పోతుందా ఏమిటి? 'నా పేరు చందూలాల్' అని సహజభావంతో అన్నప్పటికీ, అది అహంకారమే. ఎందుకంటే మీరెవరో మీకు తెలియదు, మీరు 'కానిదాన్ని' ఆరోపించుకుంటున్నారు. అదంతా అహంకారమే కదా!

'మీరు చందూలాల్' అది డ్రామేటిక్ విషయం. అంటే 'నేను చందూలాల్‌ని' అని అనటంలో తప్పేమీ లేదు కానీ, 'నేను చందూలాల్‌ని' అనే బిలీఫ్ ఉండగూడదు.

**ప్రశ్నకర్త:** ఔను. లేకపోతే 'నేను' అనే హెూదా ఒకటి వస్తుంది.

**దాదాశ్రీ:** 'నేను' అనేది 'నేను' జాగాలో ఉంటే అది అహంకారం కాదు. కానీ 'నేను' అనేది దాని మూలస్థానంలో లేదు, ఆరోపించిన స్థానంలో ఉంది కనుకనే అది అహంకారం అవుతుంది. 'నేను' అనేది ఆరోపిత స్థానం నుంచి తొలగిపోయి మూలస్థానంలోకి వచ్చి కూర్చుంటే అప్పుడు అహంకారం తొలగిపోతుంది. అంటే 'నేను' ని కాదు తొలగించేది. 'నేను' ని దాని ఎగ్జాక్ట్ ప్లేస్ (యదార్థ స్థానం) లో కూర్చోబెట్టాలి.

## నాకు 'నేను' తెలియనితనమా?

ఇది అనంత జన్మల నుంచి నాకు 'నేను' గుప్తంగా (తెలియకుండా) ఉండే ప్రయత్నం. నేను 'నన్ను' తెలుసుకోకుండా, పరాయిదంతా తెలుసుకోవటం ఎంత

ఆశ్చర్యమో కదా! నీవు 'నీతో' ఎంత కాలం గుప్తంగా ఉంటావు? ఎంతవరకు? 'నేను ఎవరు?' అన్నది తెలుసుకోవటానికి ఉన్నదే ఈ జన్మ. మనిషి జన్మ ఎందుకంటే, 'నేను ఎవరు?' అన్నది తెలుసుకో. లేకపోతే అంతవరకు దారితప్పి తిరుగుతూనేవుంటావు. 'నేను ఎవరు?' అన్నది తెలుసుకోవాలి కదా? 'మీరు ఎవరు?' అన్నది తెలుసుకోవాలా వద్దా?

## 3) I, My అనేవాటిని వేరుచేసే ప్రయోగం

### I, My లను సెపరేట్ చెయ్యి ('నేను', 'నాది' లను వేరు చేయి.

మిమ్మల్ని, I, My లను సెపరేటర్‌తో వేరుచేయమని అంటే మీరు I, My లను సెపరేట్ చేయగలరా? I, My లను సెపరేట్ చేయాలా వద్దా? జగత్తులో ఎప్పుడో ఒకప్పుడు తెలుసుకోవాలి కదా! I, My లను సెపరేట్ చేయండి. పాల కోసం సెపరేటర్ ఉంటుంది కదా, దానితో వెన్నని సెపరేట్ (వేరు) చేస్తారు కదా? అలాగే వీటినీ వేరు చేయాలి.

మీ దగ్గర My వంటి వస్తువేమైనా ఉందా? I ఒంటరిగా ఉందా లేక My తోడుగా ఉందా?

**ప్రశ్నకర్త:** My తోడుగా ఉంది కదా!

**దాదాశ్రీ:** ఏమేం My లున్నాయి మీ దగ్గర?

**ప్రశ్నకర్త:** నా ఇల్లు, ఇంట్లోని వస్తువులన్నీ.

**దాదాశ్రీ:** అన్నీ మీవన్నట్లేనా? మరి వైఫ్ ఎవరిది?

**ప్రశ్నకర్త:** ఆమె కూడా నాదే.

**దాదాశ్రీ:** పిల్లలు ఎవరివారు?

**ప్రశ్నకర్త:** వాళ్ళూ నావాళ్ళే.

**దాదాశ్రీ:** ఈ వాచ్ ఎవరిది?

**ప్రశ్నకర్త:** అదీ నాదే.

**దాదాశ్రీ:** ఈ చెయ్యి ఎవరిది?

**ప్రశ్నకర్త:** చెయ్యి కూడా నాదే.

**దాదాశ్రీ:** అంటే 'నా తల, నా శరీరం, నా కాళ్ళు, నా చెవులు, నా కళ్ళు' అని అంటారేమో. ఈ శరీరానికి చెందినవన్నీ నావి అంటారు. అయితే 'నావి' అనే 'మీరు' ఎవరు? అది ఆలోచించలేదా? 'నా పేరు చందూలాల్' అంటారు, 'నేను చందూలాల్' అనీ అంటారు. ఇందులో వ్యతిరేక భావన కనపడటం లేదూ?

**ప్రశ్నకర్త:** కనపడుతోంది.

**దాదాశ్రీ:** మీరు చందూలాల్, కానీ అందులో I, My లు రెండూ ఉన్నాయి. ఈ I, My ల రైల్వే లైన్లు రెండూ వేరుగానే ఉంటాయి. పేరలల్‌గానే ఉంటాయి. ఎప్పటికీ కలవవు. కానీ మీరు ఒకటే అని నమ్ముతున్నారు. అందువలన, అది తెలుసుకుని My ని సెపరేట్ చేయండి. మీలో ఉన్న My ని ఒక పక్కకు పెట్టండి. My హార్ట్ ని ఒక పక్కన పెట్టండి. ఈ శరీరంలోంచి ఇంకా ఏమేమి పక్కకు పెట్టాలి?

**ప్రశ్నకర్త:** కాళ్ళు, ఇంద్రియాలు

**దాదాశ్రీ:** ఆ అన్నీ! పంచేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, అన్నీ. మరి 'మై మైండ్' అంటారా లేక 'అయామ్ మైండ్' అంటారా?

**ప్రశ్నకర్త:** 'మై మైండ్' అంటాము.

**దాదాశ్రీ:** నా బుద్ధి అంటారు కదా?

**ప్రశ్నకర్త:** ఔను.

**దాదాశ్రీ:** నా చిత్తము అంటారు కదా?

**ప్రశ్నకర్త:** ఔను.

**దాదాశ్రీ:** మరి 'మై ఇగోయిజమ్' అంటారా లేక 'అయామ్ ఇగోయిజమ్' అంటరా?

**ప్రశ్నకర్త:** 'మై ఇగోయిజమ్.'

**దాదాశ్రీ:** 'మై ఇగోయిజమ్' అన్నట్లయితే దాన్ని వేరుచేయగలుగుతారు. కానీ దాని తర్వాత, అందులో మీ భాగం ఏమిటన్నది మీకు తెలియదు. అందుకే సెపరేషన్ పూర్తిగా జరగదు. మీకు మీది కొంతవరకే తెలుసు. స్థూలమైనవే మీకు తెలుసు కానీ, సూక్ష్మమైనవి తెలియదు. సూక్ష్మాన్ని మైనస్ చేయాలి, ఆ తర్వాత సూక్ష్మతరమైనదాన్ని మైనస్ చేయాలి, ఆ తర్వాత సూక్ష్మతమమైనదాన్ని మైనస్ చేయాలి, అది జ్ఞానిపురుష్ చేసే పని.

కానీ, ఒక్కొక్కటిగా స్పేర్ పార్ట్స్‌ని మైనస్ చేస్తూపోతే, 'I', 'My' రెండూ వేరవుతాయి కదా, చివరకు ఏం మిగులుతుంది? 'My' ని ఒక పక్కన పెడితే చివరకు ఏం మిగుల్తుంది?

**ప్రశ్నకర్త:** 'I'

**దాదాశ్రీ:** ఆ 'I' ఏదైతే ఉందో, అదే మీరు. అంతే అదే 'I' ని రియలైజ్ అవాలి.

**ప్రశ్నకర్త:** అంటే సెపరేట్ చేసి, ఆ మిగిలింది 'నేను' అనుకోవాలా?

**దాదాశ్రీ:** ఔను. సెపరేట్ చేసిన తర్వాత ఏదైతే మిగిలిందో అదే 'అసలు మీరు'. 'I' అసలు మీరు. దాన్ని వెతికి పట్టుకోవాలి కదా? అందుకే ఇది సులభమైన మార్గం కదా? 'I', 'My' లను వేరుచేసినట్లయితే.

**ప్రశ్నకర్త:** మార్గమైతే సులభమైనదే కానీ, ఆ సూక్ష్మతరం, సూక్ష్మతమం కూడా వేరు చేయగలిగినప్పుడు కదా? అది జ్ఞాని సహాయం లేకుండా జరగదు కదా?

**దాదాశ్రీ:** ఔను. దాన్ని జ్ఞాని పురుష్ చెప్తారు. అందుకే మేము చెప్తాం, 'I', 'My' లను జ్ఞానీస్ సెపరేటర్‌తో సెపరేట్ చేయమని. ఆ సెపరేటర్‌ని శాస్త్రజ్ఞులు ఏమంటారు? భేదజ్ఞానం అంటారు. భేదజ్ఞానం లేకుండా మీరు ఎలా వేరుచేయగలరు? ఏమేం వస్తువులు మీవి, ఏవి మీవి కావు, ఈ రెండిటిలో భేదజ్ఞానం మీకు లేదు. భేదజ్ఞానం అంటే ఇవన్నీ 'నావి', వీటి నుంచి 'నేను' వేరు అన్నది. అందుకే జ్ఞాన పురుష్ దగ్గర, ఆయన సాన్నిధ్యంలో ఉంటే భేదజ్ఞానం ప్రాప్తిస్తుంది, ఇక మన ('I', 'My' లు) సెపరేట్ అయిపోతాయి.

'I', 'My' లను విడగొడితే అంతా చాల సులభమౌపోతుంది కదా. నేనీ పద్ధతిని మీకు చెప్తున్నాను కదా, దీన్ని అనుసరిస్తే ఆధ్యాత్మికం సరళమౌతుందా లేక కఠినమౌతుందా? లేదంటే ఈ కాలపు జీవులకైతే శాస్త్రాలు చదివి చదివి ఆయాసం వస్తుంది.

**ప్రశ్నకర్త:** అర్థం చేసుకునేందుకు మీబోటివారి అవసరం ఉంది కదా!

**దాదాశ్రీ:** ఔను. అవసరం పడుతుంది. కానీ జ్ఞాని పురుషుల ఎక్కువగా ఉండరు కదా! ఏదో ఒక సమయంలో ఉంటారు. అలాంటప్పుడు మీ పని నెరవేర్చుకోవాలి. జ్ఞాని పురష్ 'సెపరేటర్' ని తీసుకోవాలి అరగంటా గంట కోసం. దానికి కిరాయిగిరాయేమీ ఉండదు! దానితో సెపరేట్ చేసుకోండి. దానితో 'I' వేరవుతుంది. లేకపోతే కాదుకదా! 'I' వేరవగానే పనంతా పూర్తవుతుంది. శాస్త్రాలన్నిటి సారం ఇంతే.

ఆత్మ కావాలంటే 'నాది' (మై) అంతటినీ సమర్పించుకోవాల్సివుంటుంది. జ్ఞాని పురుష్‌కి 'My' ఇచ్చేస్తే, మీ దగ్గర కేవలం 'I' మాత్రమే ఉంటుంది. 'I' విత్ 'My' నే జీవాత్మ అంటారు. 'నేనున్నాను, ఇదంతా నాది' అన్నది జీవాత్మ

దశ. 'కేవలం నేనే ఉన్నాను, ఇది నాది కాదు' అన్నది పరమాత్మదశ. అంటే 'My' వలన మోక్షం ప్రాప్తించదు. 'నేనెవరిని' అన్న జ్ఞానం రాగానే 'My' వదిలిపోతుంది. 'My' వదిలిపోతే అంతా వదిలిపోతుంది.

'My' ఈజ్ రిలేటివ్ డిపార్ట్‌మెంట్, 'I' ఈజ్ రియల్. అంటే 'I' టెంపరరీ కాదు. 'I' ఈజ్ పర్మనెంట్. 'My' ఈజ్ టెంపరరీ. అంటే ఇందులో మీరు 'I' ని వెతికి పట్టుకోవాలి.

## 4) ప్రపంచంలో పైనుండేవారు ఎవరు? జ్ఞాని మాత్రమే 'నేను' తో పరిచయం చేయగలరు

**ప్రశ్నకర్త:** 'నేనెవరు' అన్నది తెలుసుకునేది ఏదైతే ఉందో, అది ఈ ప్రపంచంలో ఉంటూనే ఎలా సంభవమవగలదు?

**దాదాశ్రీ:** మరి ఎక్కడ ఉంటూ తెలుసుకోవాలి దాన్ని? ప్రపంచం కాకుండా వేరే ఏమైనా స్థలం ఉందా ఉండటానికి? జగత్తులో ఉన్నవారంతా ప్రపంచంలో ఉన్నవారే, ప్రపంచంలోనే జీవిస్తూవున్నారు. ఇక్కడే ఇది తెలుసుకోగలుగుతారు, 'నేనెవరు?' అన్నది. 'మీరెవరు?' అన్నదాన్ని తెలుసుకునే విజ్ఞానమున్నది ఇక్కడ. ఇక్కడికి రండి, మీరు గుర్తించేటట్లుగా మేము చేస్తాము.

ఇక్కడ మేము మిమ్మల్ని అడుగుతున్నదంతా, మీరు అలా చేసి ఇక్కడికి రమ్మని చెప్పటం కోసం కాదు. మీతో అవుతుందన్నది లేదు. అంటే మీతో మేము చెప్పేదేమిటంటే, మీకోసం అదంతా చేస్తామని. అందువలన మీరు ఇందులో చింతించవలసిన అవసరమేమీ లేదు. ముందుగా మీరు గుర్తించవలసింది, వాస్తవంగా 'నేను ఎవరు?' నాకు ఏం తెలుసుకునే యోగ్యత ఉన్నది అన్నది. నిజమేమిటి? కరెక్ట్‌నెస్ ఏమిటి? వర్ల్డ్ (ప్రపంచం) ఏమిటి? ఇదంతా ఏమిటి? పరమాత్మ అంటే ఏమిటి?

పరమాత్మ ఉన్నాడా? పరమాత్మ ఉన్నాడు, ఆయన మీ దగ్గరే ఉన్నాడు. బయటెక్కడ వెతుకుతున్నావు? కాకపోతే ఎవరైనా తలుపు తీస్తేనే కదా దర్శనం

చేసుకోగలుగుతాము! ఈ తలుపులు ఎంతగా మూసుకుపోయాయంటే, వాటిని స్వయంగా తెరవటం సాధ్యం కాని పని. అది కేవలం యధేచ్ఛగా ఈది ఒడ్డుకి చేరుకోగలిగిన జ్ఞానపురుష్ పని.

## తప్పులూ మీవే, మీరే పై యజమాని

మీది భగవంతుని స్వరూపం. మీపైన (బాస్, యజమాని) ఎవరూ లేరు. ఏ బాబు కూడా పైన లేడు. మిమ్మల్ని ఎవరూ ఏమీ చెయ్యలేరు. మీరు స్వతంత్రులు. కేవలం మీ తప్పిదాల వలనే మీరు బంధంలోకి వచ్చారు.

మీ పైనంటూ ఎవరూ లేరు. మీరు ఏ జీవి విషయంలో కలుగజేసుకోనూలేరు. ఇన్ని జీవాలున్నాయి కాని, ఏ జీవి మీ విషయంలో కలుగజేసుకోలేదు. అయితే అలా కలుగజేసుకునేవారు, మీ తప్పిదాల మూలంగానే మీ పనిలో కలుగజేసుకుంటున్నారు. మీరు (పూర్వంలో) కలుగజేసుకున్నారు, ఇప్పుడిది దాని ఫలం. ఈ విషయాన్ని నేను స్వయంగా 'చూసి' చెప్తున్నాను.

మేము ఈ రెండు వాక్యాలలో గ్యారెంటీ ఇస్తున్నాము, దానితో మనిషి ముక్తులౌతాడు. మేము చెప్పేదేమిటంటే,

'మీ 'పై' లోకంలో ఎవరూ లేరు. మీ పైన ఉన్నవి మీ బ్లండర్స్, మీ మిస్టేక్స్. ఈ రెండూ లేకపోతే మీరు పరమాత్మే.'

'నీ విషయంలో ఎవరూ ఏమాత్రమూ కలుగజేసుకోరు. ఏ జీవి కూడా ఇతర జీవుల విషయంలో కలుగజేసుకోగల స్థితిలో లేదు. అలా ఉంది ఈ జగత్తు.'

ఈ రెండు వాక్యాలు, అన్ని సమాధానాలను ఇస్తుంది.

## 5) ఈ జగత్తులో కర్త ఎవరు?

## జగత్‌కర్త వాస్తవికత

ఫ్యాక్ట్ (వాస్తవం) తెలుసుకోకపోవటం వలనే ఈ చిక్కులన్నీ. ఇప్పుడు మీరు, 'మీకు తెలిసినదాన్ని' తెలుసుకోవాలి, లేదా 'మీకేం తెలియదో' తెలుసుకోవాలి.

జగత్తు అంటే ఏమిటి? ఏవిధంగా తయారైంది? తయారుచేసినవారెవరు? మనకీ ఈ జగత్తుకీ ఏమిటి సంబంధం? మనతోపాటు మనతోటివారితో ఏమిటి సంబంధం? బిజినెస్ దేని ఆధారంగా జరుగుతోంది? నేనే కర్తనా లేక వేరవరైనా కర్తా? ఇవన్నీ తెలుసుకోవలసిన అవసరం ఉంది కదా?

**ప్రశ్నకర్త:** ఔనండి

**దాదాశ్రీ:** అందువలన, ఇందులో ముందుగా ఏం తెలుసుకోవాలన్నది మాట్లాడుకుందాం. జగత్తును సృష్టించినవారు ఎవరైయ్యుంటారు? మీకేమనిపిస్తోంది? ఎవరైయ్యుంటారు ఈ చిక్కులతో నిండివున్న జగత్తుని? మీ అభిప్రాయమేమిటి?

**ప్రశ్నకర్త:** ఈశ్వరుడే సృష్టించివుంటాడు.

**దాదాశ్రీ:** మరి ఈ ప్రపంచాన్నంతా చింతలో ఎందుకు పడేసాడు? చింత నుండి బయటపడే పరిస్థితే లేదు.

**ప్రశ్నకర్త:** అందరూ చింతిస్తూనేవుంటారు కదా!

**దాదాశ్రీ:** ఔనుకానీ, ఆయన ఈ ప్రపంచాన్ని సృష్టిస్తే చింతాజనకంగా ఎందుకు సృష్టించాడు? ఆయనని పట్టుకుని తీసుకురా, సిబిఐ వాళ్ళని పంపించి. కానీ, భగవంతుడు అపరాధం చేసినవాడు కాడు. ఆయనని ఈ మనుషులే అపరాధిని చేసారు.

వాస్తవమేమిటంటే, గాడ్ ఈజ్ నాట్ క్రియేటర్ ఆఫ్ దిస్ వర్ల్డ్ ఎటాల్. ఓన్లీ సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్. అంటే ఇదంతా ప్రకృతి రచన. దీన్ని నేను గుజరాతీలో, 'వ్యవస్థిత శక్తి' అంటాను. ఇది చాల సూక్ష్మమైన విషయం.

## దీన్ని మోక్షమని అననేలేము

చిన్నపిల్లవాడు కూడా, 'భగవంతుడే సృష్టించాడు' అని అంటాడు. పెద్ద పెద్ద సంత్‌లు కూడా 'భగవంతుడే సృష్టించాడు' అంటారు. ఇది లౌకికమైన విషయమే కాని, అలౌకికం కాదు.

భగవంతుడే కనుక క్రియేటర్ (నిర్మాత) అయ్యుంటే ఆయన మన మీదనే ఎప్పుడూ ఉంటాడు, మోక్షమనేదే ఉండదు. కానీ మోక్షమనేది ఉంది. భగవంతుడు క్రియేటర్ కాడు. మోక్షాన్ని అర్థం చేసుకున్నవారు భగవంతుని క్రియేటర్ అని ఒప్పుకోరు. 'మోక్షము', 'క్రియేటర్' ఈ రెండూ విరుద్ధ పదాలు. క్రియేటర్ అయితే ఎల్లప్పుడూ ఉపకారిగానే ఉంటాడు. ఉపకారి ఎందుకంటే, చివరివరకూ పైనున్నవాడు పైనే ఉన్నాడు.

## మరి భగవంతుడిని ఎవరు సృష్టించారు?

అలౌకికపరంగా మనం, 'భగవంతుడు సృష్టించాడు' అంటే, 'లాజిక్' వాళు ్ళ, 'భగవంతుడిని ఎవరు సృష్టించారు?' అనే ప్రశ్నను లేవనెత్తుతారు. నాతో మనుషులు 'భగవంతుడే ప్రపంచానికి కర్త అని మాకు అనిపిస్తుంది. మీరేమో కాదంటారు. కానీ మీమాటలు మాకు సమ్మతం కాదు' అంటూవుంటారు. అప్పుడు నేను వాళ్ళనిలా అడుగుతాను, ఒకవేళ భగవంతుడే కర్త అని నేను ఒప్పుకున్నానుకో మరి, భగవంతుని సృష్టించింది ఎవరు? నాకు ఈ సంగతి చెప్పు. ఆ సృష్టించినవాడిని ఎవరు సృష్టించారు? ఎవరైనా కర్త అయితే, వాళ్ళకీ ఒక కర్త ఉండాలి అదే 'లాజిక్!' కాని దానికి ఎండ్ (అంతం) అనేదే ఉండదు కాబట్టి అది సరికాదు.

## జగత్తుకి ఆది, అంతం అనేవి లేవు

అంటే, ఎవరూ తయారుచేయకుండానే తయారయింది. ఎవరూ సృష్టించలేదు దీన్ని. ఎవరూ సృష్టించనప్పుడు, మనం ఎవరిని వెళ్ళి అడుగుతాం దీన్ని గురించి? నేను కూడా వెతుకుతుండేవాడిని, ఎవరీ గందరగోళాన్ని సృష్టించి, ఆ భారాన్ని మోస్తున్నారా అని. నేను అన్ని రకాలుగా వెతికాను కాని దొరకలేదు.

నేను 'ఫారిన్' సైంటిస్ట్‌లను అడిగాను, 'గాడ్ క్రియేటర్ అయితే, దాన్ని నిరూపించేందుకు మీరు నాతో కాసేపు మాట్లాడండి. ఒకవేళ ఆయనే క్రియేటర్ అయితే, ఆయన ఏ సంవత్సరంలో సృష్టించాడు, ఇది చెప్పండి' అని.

అప్పుడాయన, సంవత్సరమైతే తెలియదు' అన్నాడు. నేను మళ్ళీ, 'కాని దాని బిగినింగ్ (ప్రారంభం) అయిందా లేదా?' అని అడిగితే దానికి ఆయన, 'ఆ. బిగినింగ్ జరిగింది. క్రియేటర్ అని అన్నాము అంటే బిగినింగ్ జరగబట్టే కదా!' అన్నాడు. బిగినింగ్ జరిగినదానికి, అంతం కూడా ఉంటుంది. కాని, ఇది ఎండ్ అనేది లేని జగత్తు. బిగినింగ్ జరగనప్పుడు ఎండ్ ఎక్కడి నుండి జరుగుతుంది? ఇది అనాది, అనంతమైనది. దేని బిగినింగ్ అయితే జరగలేదో, దాన్ని సృష్టించేవారు ఉండరు అని మీకు అనిపించటం లేదా?

## భగవంతుని సరైన చిరునామా

'అంటే, భగవంతుడు లేడా?' అని ఈ ఫారిన్ సైంటిస్ట్‌లు అడిగినపుడు, 'భగవంతుడే లేకపోతే ఈ జగత్తులో కలిగే భావనలు, సుఖదు:ఖాలకు కలిగే అనుభవం,  అలాంటి అనుభవాలే ఉండవు. అందువలన భగవంతుడు తప్పక ఉన్నాడు' అని అన్నాను. ఆయన నన్ను, 'భగవంతుడు ఎక్కడు ఉన్నాడు?' అని అడిగాడు. 'మీకు ఏమనిపిస్తోంది?' అని అంటే, 'పైన' అన్నాడతను. 'పైన ఎక్కడ ఉంటాడు ఆయన? వీధి నంబరు ఏమిటి? ఏ వీధి? తెలుసా మీకు? ఉత్తరం రాస్తే అందేంత సరైన అడ్రెస్ తెలుసా మీకు' అని అడిగాను. పైన ఎవరి బాబు కూడా లేడు. నేను అన్ని చోట్లకూ తిరిగివచ్చాను. పైన ఉన్నాడు అని అందరూ అంటూ, వేలు పైకెత్తి చూపిస్తుంటారు. దీనితో నా మనసులో, అందరూ చెప్తున్నారంటే ఏదో ఉండివుండాలి అనిపించింది. అందువలన నేను పైన అన్ని చోట్లా వెతికివచ్చాను. అయితే పైనంతా ఆకాశమే ఉంది. పైన ఎవరూ కనపడలేదు. పైన ఎవరూ నివాసం ఉండరు. అప్పుడా ఫారిన్ సైంటిస్ట్ నన్ను, 'భగవంతుని సరైన అడ్రస్ చెప్తారా?' అని అడిగాడు. దానికి నేను, 'రాసుకోండి! గాడ్ ఈజ్ ఇన్ ఎవిరీ క్రీచర్ వెదర్ 'విజిబుల్' ఆర్ 'ఇన్‌విజిబుల్', నాట్ ఇన్ క్రియేషన్' అన్నాను. (భగవంతుడు కళ్ళకు కనిపించే, లేక కళ్ళకు కనిపించని, ప్రతి జీవిలో విరాజమానుడైయున్నాడు కానీ మానవుడు తయారుచేసిన ఏ వస్తువులోనూ లేడు!)

ఈ టేప్ రికార్డర్ 'క్రియేషన్' అనిపించుకుంటుంది. మాన్‌మేడ్ (మానవ నిర్మిత) వస్తువులన్నీ, మనుషులు సృష్టించిన వస్తువులు. అందులో భగవంతుడు లేడు. ప్రాకృతిక రచన ఏదైతే ఉంటుందో, అందులో భగవానుడు ఉన్నాడు.

## మనోనుకూల సిద్ధాంతం

అంటే, ఇది సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్. ఎన్నో సంయోగాలతో ఒక కార్యం జరుగుతుంది. అందులో 'ఇగోయిజమ్' కి వెళ్ళి, 'నేను చేసాను' అని విర్రవీగుతారు. మంచి జరిగితే 'నేను చేసాను', చెడిపోతే 'నాకు ఇప్పుడు కలిసిరావటం లేదు' అని మనుషులు అంటూవుంటారు కదా! అంటే కాలం కలిసిరావటాన్ని మనుషులు నమ్ముతారు కదా?

**ప్రశ్నకర్త:** ఔను.

**దాదాశ్రీ:** ఆదాయం వస్తే దానిలోని గర్వరసాన్ని తనే జుర్రుకుంటాడు. కాని నష్టం వచ్చినపుడు ఏదో ఒక వంక వెతుక్కుంటాడు. మనం అతన్ని 'సేఠ్ జీ, అలా ఎందుకు జరిగింది ఇప్పుడు?' అని అడిగితే, 'భగవంతుడు ఆగ్రహించాడు' అంటాడు.

**ప్రశ్నకర్త:** మనసుకి తోచిన సిద్ధాంతం అయింది.

**దాదాశ్రీ:** ఔను మనసుకి తోచింది. కానీ ఆయన (భగవంతుడు) మీద అటువంటి ఆరోపణ చేయగూడదు. వకీలు మీద ఆరోపణ చేసినా, లేక మరెవరి మీద ఆరోపణ చేసినా సరే కానీ, భగవంతుని మీద ఆరోపణ చేస్తారా? వకీలు దావా వేసి లెక్క అడుగుతాడు కానీ, ఈయన మీద దావా ఎవరు వేస్తారు? దాని ఫలితంగా తర్వాత జన్మలో (ప్రపంచంలో) భయంకరమైన బేడీలు పడతాయి. భగవంతుని మీద ఆరోపణ చేస్తారా?

**ప్రశ్నకర్త:** చెయ్యగూడదు.

**దాదాశ్రీ:** లేదా 'స్టార్స్ ఫేవరబుల్' (గ్రహాల అనుకూలం) లేదు అంటారు. లేదా 'పార్టనర్ తప్పు' అంటారు. లేకపోతే, 'మా అబ్బాయికి పెళ్ళి చేసిన కోడలు దురదృష్టవంతురాలు' అంటారు. అంతేకానీ, తన తల మీదకి రానివ్వరు. తప్పుని ఎప్పటికీ తన తల మీదకు తీసుకోరు. ఈ విషయంలో ఒక ఫారిన్ వ్యక్తితో మాట్లాడటం జరిగింది. 'మీ ఇండియన్ మనుషులు తప్పుని తన తల మీదకు రానివ్వరు ఎందుకని?' అని అడిగాడు. నేను దానికి, 'ఇదే ఇండియన్ పజిల్. ఇండియాలో అన్నిటికన్నా పెద్ద పజిల్ (చిక్కు సమస్య) ఏమైనా ఉంటే అది ఇదే' అన్నాను.

## సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్

అందుకే అందరితో మాట్లాడు. ఏమేం మాట్లాడాలో అవన్నీ మాట్లాడు. ఎంతగా మాట్లాడుతావంటే, మీకు అన్నిటికీ సమాధానాలు దొరకాలి.

**ప్రశ్నకర్త:** ఈ 'సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్' అనేది అర్థం కాలేదు.

**దాదాశ్రీ:** ఇదంతా సైంటిఫిక్ సర్మమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ (వైజ్ఞానిక సంయోగ ప్రమాణాలు) మీదనే ఆధారపడి వుంది. ప్రపంచంలో ఒక్క పరమాణువు కూడా మారేటట్టుగా ఉండదు. ఇప్పుడు మీరు భోజనానికి కూర్చున్నారనుకుందాం, మీరు ఏం తింటారో మీకు తెలియదు కదా? వంట చేసేవారికి తెలుసా రేపు ఏం వండబోతున్నారు అన్నది? ఇదెలా జరుగుతోంది. ఇది కూడా వింతే. మీరు ఎంత తింటారు, ఎంత తినరు అదంతా పరమాణువంత నిశ్చితం.

ఈరోజు మీరు నన్ను కలిసారు కదా, అలా ఏ ఆధారంగా కలవగలిగారు? ఓన్లీ సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ అది. అతి–అతి గుహ్యా కారణం. ఆ కారణాలను వెతికి పట్టుకో.

**ప్రశ్నకర్త:** వాటిని ఎలా వెతికి పట్టుకోగలం?

**దాదాశ్రీ:** ఇప్పుడు మీరు ఇక్కడకు వచ్చినట్లు, మీ చేతిలో ఏమీ లేదు.

ఇది మీరు ఒప్పుకుంటారా లేక ఇగోయిజమ్‌కి వెళ్ళి 'నేను వచ్చాను, నేను వెళ్ళాను' అంటారా? 'నేను వచ్చాను' అని మీరు అంటారే, మరి 'నిన్న ఎందుకు రాలేదు?' అని నేను అడిగితే, ఇలా కాళ్ళవైపు చూపిస్తారు. దానితో ఏమి అర్థం చేసుకోవాలి?

**ప్రశ్నకర్త:** కాళ్ళ నొప్పులు వచ్చాయి.

**దాదాశ్రీ:** ఔను. కాళ్ళ నొప్పులు వచ్చాయి. కాళ్ళ మాట ఎత్తితే ఏమిటి అర్థం, వచ్చేవారు మీరా మీ కాళ్ళా?

**ప్రశ్నకర్త:** కానీ, 'నేను వచ్చాను' అనే కదా అంటాము.

**దాదాశ్రీ:** మీరే వచ్చారా? కాళ్ళు నొప్పులు ఉన్నా మీరు వస్తారా?

**ప్రశ్నకర్త:** రావాలనే ఇచ్ఛ కలిగింది కనుక వచ్చాను.

**దాదాశ్రీ:** అంతే మీ ఇచ్ఛ కాబట్టి వచ్చారు. కానీ ఈ కాళ్ళు వగైరా బాగున్నాయి కనుకనే రాగలిగారు కదా? బాగోలేకపోతే?

**ప్రశ్నకర్త:** అలాంటప్పుడు రాలేను నిజమే.

**దాదాశ్రీ:** అంటే మీ ప్రమేయంతోనే రాగలరా? ఒక వ్యక్తి రథం మీద కూర్చుని ఇక్కడకు వచ్చి, 'నేను వచ్చాను, నేను వచ్చాను' అంటే, నేను, 'మీ కాళ్ళకి పెరాలిసిస్ వచ్చింది కదా మీరెలా వచ్చారు?' అని అడిగితే, 'రథంలో వచ్చాను కానీ నేనే వచ్చాను' అంటారు. 'అరె, రథం వచ్చిందా, లేక మీరొచ్చారా?' అంటే, 'రథం వచ్చింది' అంటాడతను. అప్పుడు నేను, 'రథం వచ్చిందా, దున్నపోతు వచ్చిందా' అని అడుగుతాను.

అంటే, ఇదంతా ఎక్కడి నుంచి ఎక్కడికి పోతోంది! కానీ చూడండి, వేరే విధంగా తీసుకుంటున్నాము. అన్ని విషయాలూ కుదిరితేనే రాగలుగుతారు. లేకపోతే రాలేరు.

తలనొప్పి ఉంటే, మీరు వచ్చినా తిరిగి వెళ్ళిపోతారు. వచ్చే పోయే వారు మీరే అయితే, తలనొప్పి వంక పెట్టుకోలేరు కదా? అరె, అప్పుడు మీ తల వచ్చినట్లా లేక మీరు వచ్చినట్లా? ఎవరైనా దారిలో కనిపించి, 'చందూలాల్ నాతో పదండి' అంటే కూడా మీరు తిరిగి వెళ్ళిపోతారు. అంటే అంతా అనుకూలంగా ఉంటే, ఎవరూ అడ్డుపెట్టనివారు ఉంటేనే ఇక్కడి వరకు రాగలరు.

## మీకున్న అధికారం ఎంత?

మీరు ఎప్పుడూ తిననుకూడా తినలేదు. అదంతా చందూలాల్ తిన్నాడు, మీరు మనసులో, నేనే తిన్నాను అని నమ్ముతున్నారు. చందూలాలే తింటాడు, మరుగుదొడ్డికి కూడా చందూలాలే వెళ్తాడు. అనవసరం ఇందులో ఇరుకున్నావు. ఇది మీకు అర్థమౌతున్నదా?

**ప్రశ్నకర్త:** ఇది వివరించండి.

**దాదాశ్రీ:** ఈ ప్రపంచంలో స్వతంత్రంగా మరుగుదొడ్డిలో విసర్జనకి వెళ్ళే వాళ్ళు ఇంకా పుట్టనే లేదు. మలమూత్రవిసర్జనకు కూడా మీకు అధికారం లేనపుడు ఇక దేనికుంటుంది అధికారం? మీకు నచ్చినట్లు ఏదో కాస్త జరిగిందంటే మీరు మనసులో, అంతా నావలనే జరుగుతోంది అనుకుంటారు. ఆగిపోయినపుడు అర్థమౌతుంది.

నేను ఫారిన్ రిటర్న్ డాక్టర్లని ఇక్కడ బరౌదాకి పిలిచాను. పది పన్నెండు మంది వచ్చారు. వాళ్ళతో నేను, 'మీకు మరుగుదొడ్డికి విసర్జనకి వెళ్ళటానికి కూడా మీకు స్వాతంత్ర్యం లేదు' అని అన్నాను. దానితో వాళ్ళలో అలజడి చెలరేగింది. ఆ తర్వాత ఇంకా, 'అది అగిపోయినప్పుడు తెలుస్తుంది. అప్పుడు అక్కడ ఎవరి హెల్ప్ అయినా తీసుకోవలసి వస్తుంది. అందువలన అది మీ స్వతంత్ర శక్తి కాదు. అంతా మీరు భ్రాంతితో ప్రకృతి శక్తిని మీ శక్తి అనుకుంటున్నారు' అన్నాను. పరాయి అధికారాన్ని తన అధికారమని అనుకోవటాన్నే భ్రాంతి అంటారు. ఇది కాస్తోకూస్తో అర్థమయిందా మీకు? రెండు అణాలా నాలుగు అణాలా ఎంత అర్థమైంది?

**ప్రశ్నకర్త:** ఆ. అర్థమౌతోంది.

**దాదాశ్రీ:** ఇంతమాత్రం అర్థమైనా విషయం తేలికౌతుంది. వీళ్ళంతా అంటూవుంటారు కదా, 'నేను ఇంత తపస్సు చేసాను, అంత జపం చేసాను, ఉపవాసాలు చేసాను' అని, అదంతా భ్రాంతే. అయినా జగమంతా ఎలా ఉండేది అలాగే ఉంటుంది. అహంకారం లేకుండా ఉండదు. స్వభావం కదా!

## కర్త, నైమిత్తిక కర్త

**ప్రశ్నకర్త:** వాస్తవంగా స్వయంగా కర్త కాకపోతే మరి కర్త ఎవరు? అతని స్వరూపం ఏమిటి?

**దాదాశ్రీ:** విషయమేమిటంటే, నైమిత్తిక కర్తవి నీవే. నీవు స్వతంత్ర కర్తవు కావు, నైమిత్తిక కర్తవు. అంటే పార్లమెంటరీ పద్ధతిలో కర్తవు. పార్లమెంటరీ పద్ధతి అంటే? పార్లమెంటులో అందరి వోటింగ్ జరుగుతుంది, చివరకు తన సొంత వోటింగ్ ఉంటుంది. దానితో అతను, 'ఇది నేను చెయ్యవలసివచ్చింది' అంటాడు. ఆ విధంగా కర్త అవుతాడు. ఆవిధంగా యోజనను సర్జన చేసి పంపిస్తుంది. యోజన చేసేవాడు తనే. కర్తృత్వం కేవలం యోజనలోనే ఉంటుంది. యోజనలో అతని సంతకం ఉంటుంది. కానీ, ప్రపంచంలో మనుషులు ఈ విషయాన్ని తెలుసుకోరు. చిన్న కంప్యూటర్ నుంచి ఫీడ్ చేసింది పెద్ద కంప్యూటర్‌లోకి పోతుంది. ఆ విధంగా యోజన సర్జనతో పెద్ద కంప్యూటర్‌లోకి పోతుంది. ఆ పెద్ద కంప్యూటర్ దాన్ని విసర్జిస్తుంది. కనుక, ఈ జన్మలోని లైఫ్ అంతా విసర్జన రూపంలోనే వుంది. దాని సర్జన పూర్వజన్మలో జరిగింది. కాబట్టి ఈ జన్మలో జన్మతీసుకోవటం దగ్గరి నుంచి మృత్యువు వరకు అంతా విసర్జన రూపంలోనే ఉంది. మీ చేతిలో ఏమీ లేదు. పరసత్తాలోనే ఉంది. ఒకసారి యోజన తయారైందంటే అంతా పరసత్తా లోకే పోతుంది. రూపంలోను, పరిణామంలోను ఆ పరసత్తా మాటే చెల్లుతుంది. అంటే పరిణామం వేరు. పరిణామం పరసత్తాలో ఉంది. మీకు అర్థమౌతోందా? ఈ విషయం చాల లోతైనది.

## కర్తృత్వ భావనతోనే కర్మబంధం

**ప్రశ్నకర్త:** కర్మబంధం నుంచి బయటపడాలంటే ఏమి చెయ్యాలి?

**దాదాశ్రీ:** ఈ కర్మ అంతా ఆ కర్త చేతిలో ఉంది. కనుక కర్త ఉంటేనే కర్మ అనేది ఉంటుంది. కర్తే లేకపోతే కర్మే ఉండదు. ఏవిధంగా కర్త? ఆరోపిత భావంలోకి వెళ్ళటంతో కర్త అయ్యాడు. మీరు మూల స్వభావంలోకి వస్తే, మీరు కర్త కానేకారు. 'నేను చేసాను' అనుకోవటం వలనే కర్త అయ్యారు. అంటే కర్మకి ఓ ఆధారాన్నిచ్చారు. ఇక ఇప్పుడు మీరు కర్తే కాకపోతే కర్మ నశిస్తుంది. కర్మని నిరాధారం చేస్తే నశిస్తుంది. అంటే కర్తృత్వ భావం ఉన్నంత వరకే కర్మ ఉంటుంది.

*'छूटे देहाध्यास तो नहीं कर्ता तू कर्म,*
*नहीं भोक्ता तू उसका, यही धर्म का मर्म'*

*-श्रीमद राजचंद्र*

*'దేహాభ్యాసం వదిలిపోతే కర్తవి కావు నువు కర్మకి,*
*కావు భోక్తవు నువు దానికి, ఇదే ధర్మము లోని మర్మము'*

*–శ్రీమద్ రాజచంద్ర*

ఇప్పుడు మీరు 'నేను చందూలాల్‌ని' అనుకుంటున్నారు. అందుకే అంతా కలిసిపోయింది. లోపల రెండు వస్తువులు విడివిడిగా ఉన్నాయి. మీరు వేరు, చందూలాల్ వేరు. కాని, మీకిది తెలియనంతవరకు, అప్పటివరకు ఏం జరుగుతుంది? జ్ఞాని పురుష్ భేదజ్ఞానంతో వేరుచేస్తాడు. ఆ తర్వాత 'మీరు' ('చందూలాల్' నుంచి) వేరవుతారు. ఇక అప్పుడు 'మీకు' ఏమీ చెయ్యవలసిన అవసరం ఉండదు. అంతా చందూలాల్ చేస్తుంటారు.

## 6) భేదజ్ఞానం ఎవరు కలిగిస్తారు?
## ఆత్మ, అనాత్మల వైజ్ఞానికి విభజన

ఈ ఉంగరంలో బంగారం, రాగి కలిసివున్నాయి కదా, దీన్ని గ్రామంలో ఎవరిదగ్గరికైనా తీసుకెళ్ళి, 'అన్నా వీటిని వేరువేరుగా విడగొట్టు' అంటే ఎవరైనా ఆ పని చేసేస్తారా? ఎవరు చేయగలరు?

**ప్రశ్నకర్త:** బంగారం పనిచేసే మనిషి చెయ్యగలడు.

**దాదాశ్రీ:** అది ఎవరి పనో అతను. ఎవరు ఎక్స్‌పర్టో అతను ఈ బంగారం రాగి రెండిటినీ విడదీస్తాడు. నూటికి నూరు శాతం బంగారాన్ని వేరుచేస్తాడు. ఎందుకంటే ఆ రెండిటి గుణధర్మాలూ అతనికి తెలుసు, బంగారం గుణధర్మం ఇలా ఉంటుంది, రాగి గుణధర్మం ఇలా ఉంటుంది అని. అలాగే జ్ఞాని పురుష్‌కి ఆత్మ గుణ ధర్మం తెలుసు, అనాత్మ గుణధర్మం తెలుసు.

ఉంగరంలో బంగారం, రాగిల మిక్చర్ ఉంటుంది కనుక వాటిని విడదీయవచ్చు. బంగారం, రాగి కాంపౌండ్ మిక్చర్ అయిపోతే వాటిని విడదీయలేము. ఎందుకంటే, దానివలన దాని గుణధర్మం వేరే విధంగా ఉంటుంది కనుక. అదేవిధంగా జీవులలో చేతన, అచేతనల మిక్చర్ ఉంది కాని అవి కాంపౌండ్ స్వరూపంలోకి వచ్చివుండలేదు. అందువలన వాటిని తిరిగి స్వభావంలోకి తీసుకునిరావొచ్చు. కాంపౌండ్ అయ్యుంటే అవి తెలిసేవే కావు. చేతన గుణధర్మం కూడా తెలియదు, అచేతన గుణధర్మం కూడా తెలియదు, మూడవ గుణధర్మం ఉత్పన్నమయ్యిండేది. కానీ అలా జరగలేదు. అవి కేవలం మిక్చరే అయ్యున్నాయి. అందువలన జ్ఞాని పురుష్ విడదీస్తే, ఆత్మను గుర్తించగలుగుతాం.

## జ్ఞానవిధి ఏమిటి?

**ప్రశ్నకర్త:** మీ జ్ఞానవిధి ఏమిటి?

**దాదాశ్రీ:** జ్ఞానవిధి సెపరేషన్ (వేరు) చేస్తుంది– పుద్గల్ (అనాత్మ), ఆత్మలను. శుద్ధ చేతన, పుద్గల్ రెండిటి సెపరేషన్.

**ప్రశ్నకర్త:** ఈ సిద్ధాంతం సరే కానీ, ఆ విధానమేమిటి అన్నది తెలుసుకోవాలి.

**దాదాశ్రీ:** ఇందులో ఇచ్చిపుచ్చుకునేవి ఏమీ ఉండవు. కేవలం ఇక్కడ కూర్చుని ఎలా చెప్తే అలా పలుకలవలసివుంటుంది. ('నేను ఎవరు?' అన్నది గుర్తించటం, జ్ఞానం ఇప్పించేందుకు రెండు గంటలు జ్ఞాన ప్రయోగం ఉంటుంది. అందులో నలభై ఎనిమిది నిమిషాలు, ఆత్మ, అనాత్మలను వేరుచేసేవారి భేదజ్ఞాన వాక్యాలను అనిపిస్తారు. వాటిని అందరూ అనాలి. ఆ తర్వాత ఒక గంటలో ఉదాహరణలతో పంచాజ్ఞలను వివరంగా చెప్పటం జరుగుతుంది. ఏవిధంగా శేష జీవితాన్ని, కర్మబంధాలు పడకుండా, పాత కర్మలు పూర్తిగా విడిపోయే విధంగాను, దానితోపాటు ఎల్లప్పుడూ 'నేను శుద్ధాత్మను' అనే జాగృతిలో ఉండేటట్లుగాను గడపాలి అన్నది తెలుస్తుంది.

## గురువా, జ్ఞానా ఎవరు అవసరం?

**ప్రశ్నకర్త:** దాదాజీని కలవటానికి ముందు ఎవరినైనా గురువుగా స్వీకరించివుంటే? అప్పుడు అతన్ని ఏం చెయ్యాలి?

**దాదాశ్రీ:** అతని దగ్గరకు వెళ్ళాలి కదా. ఒకవేళ వెళ్ళదలచుకోకపోతే ఆ అవసరం లేదు. మీకు వెళ్ళాలనిపిస్తే వెళ్ళండి, వెళ్ళగూడదనుకుంటే వెళ్ళకండి. ఆయనకి బాధ కలిగించగూడదు కనుక కూడా వెళ్ళాలి. మనం వినయపూర్వకంగా ఉండాలి. ఇక్కడ 'ఆత్మజ్ఞానం' తీసుకునే ముందు ఎవరైనా నన్ను, 'నేను ఇప్పుడు గురువుని వదిలిపెట్టనా?' అని అడిగితే, నేను, 'వదిలిపెట్టవద్దు బాబూ, అరె, ఆ గురువు కారణం వలనే ఇక్కడి వరకు వచ్చావు' అంటాను. గురువు కారణంగా మనిషి కాస్త పద్ధతిగా జీవిస్తాడు. గురువు లేకపోతే ఆ పద్ధతి కూడా ఉండదు. కాబట్టి గురువుతో, 'నాకు జ్ఞాని పురుష్ లభించారు. ఆయన్ని దర్శించటానికి వెళ్తున్నాను' అని చెప్పాలి. కొందరైతే వాళ్ళ గురువులను కూడా నా దగ్గరకు తీసుకునవస్తారు. ఎందుకంటే గురువుకి కూడా మోక్షం కావాలి కదా! ప్రాపంచిక

జ్ఞానం కూడా గురువు లేకుండా రాదు. అలాగే మోక్ష జ్ఞానం కూడా గురువు లేకుండా రాదు. వ్యవహారాలకు సంబంధించిన గురువు వ్యవహారాల వరకు, జ్ఞాని పురుష్ 'నిశ్చయం' కోసం. వ్యవహారమనేది రిలేటివ్, జ్ఞానం నిశ్చయమైన రియల్. రిలేటివ్ కోసం గురువు అవసరం ఉంది, రియల్ కోసం జ్ఞానిపురుష్ అవసరం ఉంది.

## 7) మోక్ష స్వరూపం ఏమిటి? ధ్యేయం ఉండాల్సింది ఇంతే

**ప్రశ్నకర్త:** మనిషికి ధ్యేయం ఏముండాలి?

**దాదాశ్రీ:** మోక్షానికి వెళ్ళటానికే. ఇదే ధ్యేయంతో ఉండాలి. మీరు కూడా మోక్షంలోకే వెళ్ళాలి కదా. ఎప్పటివరకు దారితప్పి తిరుగుతుంటారు? అనంత జన్మల నుంచీ దారితప్పి తిరిగి తిరిగి... ఇంకేమైనా మిగిలివుందా తిరగటానికి? తిర్యంచ (జంతుగతి)లో, మనుష్యగతిలో, దేవగతిలో, అన్నిచోట్లలోను తిరుగాడుతూనేవున్నావు. ఎందుకలా తిరుగాడాల్సివచ్చింది? ఎందుకంటే 'నేనెవరు?' అన్నది కూడా తెలుసుకోలేదు కనుక. స్వస్వరూపాన్నే గుర్తించలేదు. స్వస్వరూపాన్ని తెలుసుకోవాలి. 'నేనెవరు?' అన్నది తెలుసుకోవద్దా? ఇంత తిరిగి కూడా తెలుసుకోలేకపోయారా మీరు? డబ్బు సంపాదన వెనకేపడ్డారా? మోక్షం కోసం కూడా కొద్దో గొప్పో చెయ్యాలికదా?

**ప్రశ్నకర్త:** చెయ్యాలి.

**దాదాశ్రీ:** అంటే స్వతంత్రులమయ్యే అవసరం ఉంది కదా? ఇలా పరతంత్రంలో ఎన్నాళ్ళుంటారు?

**ప్రశ్నకర్త:** నా ఉద్దేశ్యంలో, స్వతంత్రులం అవాల్సిన అవసరమే లేదు కానీ, స్వతంత్రులమయేంత జ్ఞానం ఉంటే చాలు.

**దాదాశ్రీ:** ఔను. ఆ జ్ఞానం అవసరమే ఉంది. ఆ జ్ఞానం వస్తే చాలు ఎంతో పొందినట్లే. స్వతంత్రులం అవకపోయినా పరవాలేదు. స్వతంత్రులవటం అవకపోవటం అంతా తర్వాత సంగతి. అయినా ఆ జ్ఞానం అవసరమైతే ఉందికదా? ముందు దాని గురించి తెలిస్తే చాలు, ఎంతో జరిగినట్లే.

## స్వభావంలోకి రావటానికి కష్టపడనక్కర్లేదు

మోక్షం, అంటే తన స్వస్వభావంలోకి రావటం, ప్రపంచం అంటే తన విశేష భావనలోకి పోవటం. అయితే ఏది సులభమైనది? స్వభావంలోనే ఉండటం. అంటే మోక్షం కఠినమైనదేమీ కాదు. ప్రపంచమే ఎప్పుడూ కఠినంగా ఉంటుంది. మోక్షమంటే పొంగలి చెయ్యటం కంటే కూడా సులువైనదే. పొంగలి చెయ్యాలంటే కట్టెలు తేవాలి, బియ్యం, పప్పు తేవాలి, గిన్నె తీసుకోవాలి, నీళ్ళు పట్టి తేవాలి. అప్పుడు తయారౌతుంది పొంగలి. కానీ, మోక్షం పొంగలి చేయటం కంటే సులభమైనదే కానీ, మోక్షప్రదాత అయిన జ్ఞాని లభించాలి. లేకపోతే మోక్షం కలుగనేకలుగదు. కోట్లాది జన్మలు గడిచిన తర్వాత కూడా కలుగదు. అనంత జన్మలు అయ్యాయి కదా?

## మోక్షం శమిస్తే లభించేది కాదు

మా దగ్గరికి వచ్చి మోక్షం పొందు అని మేము అంటూవుంటాము కదా! అందరూ మనసులో అనుకుంటూవుంటారు, 'అలా ఇచ్చిన మోక్షం ఎందుకు పనికొస్తుంది మనం కష్టపడి పొందాలి కాని' అని. 'సరే బాబూ కష్టపడి సంపాదించుకో. చూడండి వాళ్ళ అవగాహన ఎంత గొప్పదో (!) ?' కాకపోతే కష్టపడితే వచ్చేది కాదు మోక్షం. శ్రమించి ఎప్పుడూ ఎవ్వరికీ మోక్షం పొందలేదు.

**ప్రశ్నకర్త:** మోక్షాన్ని ఇవ్వటం, పుచ్చుకోవటం జరుగుతుందా?

**దాదాశ్రీ:** అందులో ఇచ్చిపుచ్చుకునేదేమీ లేదు. ఇదంతా నిమిత్తమాత్రం. మీరు నన్ను కలిసారు. ఇది నిమిత్తమాత్రం. నిమిత్తమైతే అవసరం. ఇకపోతే

ఇచ్చేవారంటూ ఒకరు లేరు, తీసుకునేవారు ఒకరు లేరు. ఇచ్చేవారు అని ఎవరిని అంటారు. ఎవరైనా వాళ్ళ ఇంట్లో వస్తువు ఇచ్చినట్లయితే వారిని ఇచ్చేవారు అంటారు. ఇదేమిటంటే మీ ఇంటిలోనిదే ఈ మోక్షం అనేది. మేము కేవలం మీకు చూపించేవాళ్ళం. రియలైజ్ అయేట్లుగా చేసేవాళ్ళం. అంటే ఇందులో ఇచ్చిపుచ్చుకునేదేమీ లేదు. మనం కేవలం నిమిత్తమాత్రులం.

## మోక్షం అంటే సనాతన సౌఖ్యం

**ప్రశ్నకర్త:** మోక్షం పొంది చెయ్యాల్సిందేమిటి?

**దాదాశ్రీ:** నన్ను కలిసిన కొందరు, నాకు మోక్షం వద్దు అని అంటారు. అప్పుడు నేను, 'బాబూ, మీకు మోక్షం వద్దులే కాని మీకు సుఖమైతే కావాలి కదా? లేక దు:ఖమే ఇష్టమా?' అని అడుగుతాను. అప్పుడు వాళ్ళు, 'లేదు సుఖమైతే కావాలి' అంటారు. నేను వాళ్ళని, 'సుఖం కొంచెం తక్కువైతే పరవాలేదా?' అని అడిగితే, 'లేదు సుఖం పూర్తిగా కావాలి' అంటారు. అప్పుడు నేను, 'అయితే సుఖం గురించే మాట్లాడుకుందాం. మోక్షం సంగతి పక్కన పెట్టేద్దాం' అంటాను. మోక్షమంటే ఏమిటన్నది మనుషులకు అర్థమే కాదు. మాటల్లోనే చెప్తారు, ఇంతే అని. మనుషులు అనుకునేది ఏమిటంటే, మోక్షమనే జాగా ఒకటి ఉంది, అక్కడికి పోతే మనం మోక్షమనే మజాని పొందవచ్చని. కాని అలా లేదు ఇదంతా.

## మోక్షం రెండు స్టేజీలలో ఉంటుంది

**ప్రశ్నకర్త:** సాధారణంగా మనం, మోక్షం అంటే 'జనన మరణాల నుంచి ముక్తి' అనుకుంటాం.

**దాదాశ్రీ:** ఔను అది నిజమే. కాని అంతిమ ముక్తి అనేది సెకండరీ స్టేజ్. కాని మొదటి స్టేజ్‌లో, మొదటి మోక్షం అంటే, ప్రపంచంలోని దు:ఖాల అభావం కలిగిస్తుంది. ప్రపంచంలోని దు:ఖాల నుంచి కూడా దు:ఖం అంటకుండా,

ఉపాధి (బయటి నుంచి వచ్చే దుఖాలు) లో కూడా సమాధి స్థితిలో ఉంటే అది మొదటి మోక్షం. అయితే దేహం వదిలేసిన తర్వాత కలిగేది ఆత్యంతిక మోక్షం. కానీ మొదటి మోక్షం ఇక్కడే జరిగిపోవాలి. నాకు మోక్షం వచ్చేసింది కదా! ప్రపంచంలో ఉంటూనే, ప్రాపంచికం అంటగూడదు. అలాంటి మోక్షం లభించాలి. అది, ఈ అక్రమ విజ్ఞానంతో అది జరుగుతుంది.

## జీవించివుండగానే ముక్తి

**ప్రశ్నకర్త:** ముక్తి లేక మోక్షం ఏదైతే ఉందో, అది జీవించివుండగానే కలిగే ముక్తా లేక మరణించిన తర్వాత కలిగే ముక్తా?

**దాదాశ్రీ:** మరణించిన తర్వాత కలిగే ముక్తి ఎందుకు పనికివస్తుంది? చనిపోయిన తర్వాత ముక్తి లభిస్తుంది అంటూ మనుషులను వంచిస్తున్నారు. అరె, నాకు ఇక్కడే కనిపించింది కదా. రుచి చూసిచెప్పండి, ఏదైనా ప్రమాణం చూపించండి. అక్కడ మోక్షం వస్తుంది అని నమ్మకం ఏమిటి? అటువంటి అరువు మోక్షాన్ని మనమేం చేసుకోవాలి? ఋణం తీసుకోవటంలో శ్రేయస్సు లేదు. అక్కడ ఎక్కువేమీ ఉండదు కనుక క్యాషే మంచిది. మనమున్న దగ్గరే ముక్తి కలగాలి. జనక మహారాజు ముక్తి గురించి మీరు విన్నారా లేదా?

**ప్రశ్నకర్త:** విన్నాం.

## 8) అక్రమ మార్గం అంటే ఏమిటి?
## అక్రమ జ్ఞానంతో గొప్ప సిద్ధి

**ప్రశ్నకర్త:** ఈ ప్రపంచంలో జీవిస్తూనే ఆత్మజ్ఞానం అలా లభిస్తుందా?

**దాదాశ్రీ:** ఆ. అలాంటి పద్ధది ఉంది. ప్రపంచంలో ఉంటూనే కాదు, వైఫ్‌తో కలసివుంటూ కూడా ఆత్మజ్ఞానం పొందవచ్చు. ప్రపంచంలో ఉంటూనే కాదు, కొడుకులు, కూతుళ్ళ పెళ్ళిళ్ళుచేసి, ఇతర కార్యక్రమాలన్నిటినీ నిర్వహించి కూడా ఆత్మజ్ఞానం పొందవచ్చు. నేను ప్రపంచంలో ఉంటూనే మీచేత ఇవన్నీ

చేయిస్తున్నాను. ప్రపంచంలో ఉండటం అంటే, సినిమాకి పోవటం, ఇలాంటి వాటన్నిటికీ మీకు స్వేచ్ఛనిస్తున్నాను. కొడుకులు, బిడ్డల పెళ్ళిళ్ళు చేయటం, మంచి దుస్తులు వేసుకుని చేయటం. దీనికంటే మరేమైనా గ్యారెంటీ కావాలా?

**ప్రశ్నకర్త:** ఇంత స్వేచ్ఛ దొరికితే, తప్పక (ఆత్మలో) ఉండవచ్చు.

**దాదాశ్రీ:** అన్ని రకాల స్వేచ్ఛ. ఇది అపవాద మార్గం. మీరేమీ కష్టపడనక్కర్లేదు. మీ ఆత్మను కూడా మీ చేతుల్లో పెట్టేస్తాము. ఆ తర్వాత ఆత్మరమణతలో ఉండండి, ఈ లిఫ్ట్‌లో కూర్చునివుండండి. మీరు మరేమీ చేయవలసిన పనిలేదు. మీకు మరి కర్మ కూడా బంధించదు. ఒకే జన్మ కర్మబంధం ఉంటుంది. అది కూడా నా ఆజ్ఞాపాలన చెయ్యటానికి బదులుగా. మా ఆజ్ఞలో ఉండటం ఎందుకు అవసరమంటే, లిఫ్ట్‌లో కూర్చున్నప్పుడు చేతులను అటూ ఇటూ చాపితే కష్టాలపాలౌతారు కదా!

**ప్రశ్నకర్త:** అంటే, మరో జన్మ తప్పక ఉంటుందా?

**దాదాశ్రీ:** పూర్వ జన్మ కూడా ఉంది, ఇప్పుడు వచ్చే జన్మ కూడా ఉంటుంది కానీ ఈ జ్ఞానం ఎలాంటిదంటే, ఇక ఒకటీ రెండు జన్మలు మాత్రమే మిగిలివుంటాయి. ముందు అజ్ఞానం నుంచి ముక్తి లభిస్తుంది, ఆ తర్వాత ఒకటి రెండు జన్మలలో అంతిమ ముక్తి లభిస్తుంది. ఒక జన్మయితే శేషం ఉంటుంది. ఈ కాలం అలాంటిది.

మీరు ఒక రోజు నా దగ్గరకు రండి. మనం నిర్ణయించుకున్న రోజున రావాలి. ఆ రోజు అందరి తాళ్ళు వెనక నుంచి కత్తిరించేస్తాం. ప్రతి రోజు కత్తిరించం. రోజూ బ్లేడ్ తేవటానికి పోవాల్సివుంటుంది. ప్రతిరోజు సత్సంగంలో అన్ని విషయాలు మాట్లాడుకుంటూవుంటాం కాని ఒక రోజుని నిర్ణయించుకుంటాం, ఆ రోజు బ్లేడుతో బంధాలను కత్తిరించేస్తాం. ఇంకేమీ ఉండదు. ఇక వెంటనే మీకు అర్థమౌతుంది అంతా వీడిపోయిందని. గుండెల మీది నుంచి బంధం పోయిన అనుభవం కలిగేటప్పటికి, ముక్తి కలిగిందంటారు మీరు. అంటే

విముక్తుడనయ్యాను అనే భావం కలగాలి. ముక్తి చెందటమంటే అల్లాటప్పా కాదు. అంటే మేము మీకు ముక్తిని కలిగిస్తాము.

మీకు ఈ జ్ఞానం ఇచ్చిని రోజున ఏం జరుగుతుంది? జ్ఞానాగ్నిలో వారి కర్మలు భస్మీపటలమౌతాయి. రెండు రకాల కర్మలు భస్మమౌతాయి, ఒక రకం కర్మలు మిగిలిపోతాయి. ఆవిరి రూపంలోని కర్మ నశిస్తుంది, నీటి రూపంలోని కర్మ కూడా నశిస్తుంది. కానీ మంచు రూపంలో ఉన్న కర్మ నాశనం జరగదు. మంచు రూపంలోని కర్మలను అనుభవించవలసిందే. ఎందుకంటే అవి గడ్డకట్టుకునివున్నాయి కనుక. కర్మఫలం ఇవ్వటానికి తయారుగా ఉన్నయి కూడా వదలవు. కానీ నీరు, ఆవిరి రూపంలోని కర్మలేవైతే ఉన్నాయో, వాటిని జ్ఞానాగ్ని ఎగరగొట్టేస్తుంది. అందుకే జ్ఞానప్రాప్తి జరగగానే మనుషులు ఒక్కసారిగా తేలికైపోతారు, వారిలో జాగృతి ఒక్కసారిగా పెరుగుతుంది. ఎందుకంటే, కర్మలు భస్మం కానంతవరకు మనిషిలో జాగృతి పెరగనే పెరగదు. మంచు రూపంలోని కర్మలను మనం అనుభవించవలసిందే. కానీ, వాటిని కూడా సరళ పద్ధతిలో ఎలా అనుభవించాలి అన్నదానికి ఉన్న మార్గాలన్నిటినీ మేము మీకు చెప్పాము– "బాబూ, ఈ 'దాదా భగవాన్ కి ఆసీమ్ జయజయకార్' అనండి, త్రిమంత్రం చెప్పండి, నవ కల్మే చెప్పండి."

మేము ఇచ్చే జ్ఞానంతో కర్మలు భస్మీపటలం అయిపోతాయి. ఆ సమయంలో ఆవరించినవెన్నో విడిపోతాయి. అప్పుడు భగవానుని కృపతో అతను జాగృతిలోకి వస్తాడు. ఆ జాగృతి మళ్ళీ పోదు. నిరంతరం జాగృతిలో ఉండగలుగుతారు. అంటే నిరంతర ప్రతీతి ఉంటుంది. ప్రతీతి ఎప్పుడు ఉంటుంది? ముందు జాగృతి, తర్వాత ప్రతీతి. అ తర్వాత అనుభవం, లక్ష్యం, ప్రతీతి, ఈ మూడూ ఉంటాయి. ప్రతీతి ఎప్పటికీ ఉంటుంది. లక్ష్యం (జాగృతి) అయితే అప్పుడప్పుడూ ఉంటుంది. ఏదైనా వ్యాపారం లేక పనులలో పడ్డప్పుడు మళ్ళీ లక్ష్యం తొలగిపోతుంది, ఆ పని పూర్తవగానే తిరిగి వచ్చేస్తుంది. అనుభవం ఎప్పుడు ఉంటుందంటే, కార్యకలాపాలు, అన్నీ నివృత్తి అయిన తర్వాత ఏకాంతంలో

కూర్చున్నప్పుడు అనుభవం రుచి తెలుస్తుంది. అయితే అనుభవం పెరుగుతూనేవుంటుంది. ఎందుకంటే, అంతకు ముందు చందూలాల్ ఎవరు, ఈ రోజు చందూలాల్ ఎవరు అన్నది అర్థమౌతుంది. అయితే ఈ పరివర్తన ఎలా జరుగుతుంది? ఆత్మానుభవంతో. మొదట్లో దేహ ధ్యాసే అనుభవంలో ఉండేది. ఇప్పుడిది ఆత్మానుభవం.

**ప్రశ్నకర్త:** ఆత్మానుభవం అయిన తర్వాత ఏం జరుగుతుంది?

**దాదాశ్రీ:** ఆత్మ అనుభవంలోకి వచ్చిన తర్వాత దైహిక ద్యాస వదిలిపోతుంది. దేహధ్యాస పోవటమంటే బంధనాలు ఆగిపోయాయి. దాని నిర్వహణ (కొత్త బీజాలు పడకుండా కర్మాచరణ) ఉంటుంది. ఇకేం కావాలి?

## ఆత్మ, అనాత్మల మధ్యలో భేద రేఖ

ఇది అక్రమ విజ్ఞానం కాబట్టే అంతా సమకీతం ఔతుంది. లేకపోతే ఇప్పుడు క్రమ మార్గంలో సమకీతం అయ్యే పరిస్థితి లేనేలేదు. ఈ అక్రమ విజ్ఞానం చాల ఉచ్ఛ స్థాయిది. ఆత్మ, అనాత్మల మధ్య, అంటే మీరు, పరాయి ఈ రెండిటి మధ్య విభజన చేస్తుంది. 'ఈ' భాగం మీది, 'అది' మీది కాదు అని మధ్యలో లైన్ ఆఫ్ డిమార్కేషన్, లక్ష్మణ రేఖను గీస్తుంది అక్కడ. ఇక పక్కవారి పొలంలో పండిన బెండకాయని మనం తినలేము కదా!

## మార్గం: క్రమం, అక్రమం

తీర్థంకరుల జ్ఞానమేదైతే ఉందో, అది క్రమ జ్ఞానం. క్రమం అంటే మెట్టు తర్వాత మెట్టు ఎక్కటం. పరిగ్రహణ ఎంత తగ్గుతూపోతుంటే మోక్షానికి అంత చేరువలోకి పోతుంటారు. అది కూడా చాలా కాలం తర్వాత. అయితే ఈ అక్రమ విజ్ఞానం ఏమిటి? మెట్లు ఎక్కవలసిన పనిలేదు. లిఫ్ట్‌లో కూర్చోవాలి, పన్నెండవ అంతస్తుకి చేరుకోవాలి. అలాంటి లిఫ్ట్ మార్గం లభించింది. ఈ లిఫ్ట్ మార్గంలో కూర్చున్నవారికి శుభం జరుగుతుంది. నేను నిమిత్తమాత్రుడనే. ఈ లిఫ్ట్ కూర్చున్నవారికి అంతా సులభమౌతుంది కదా! సులభతరం చేసుకోవాలి

కదా? మనం మోక్షానికి తప్పక వెళ్తాం, కానీ ఆ లిఫ్ట్‌లో కూర్చున్న ప్రమాణం ఉండాలా వద్దా? దానికి ప్రమాణం అంటే, క్రోధం, మాన, మాయ, లోభాలు ఉండగూడదు. ఆర్తధ్యానం, రౌద్రధ్యానం ఉండగూడదు. అప్పుడు కార్యం పూర్తవుతుంది కదా!

## ఎవడైతే నన్ను కలిసాడో అతడే పాత్రుడు

**ప్రశ్నకర్త:** ఈ మార్గం ఇంత సులభమైనదైతే మరి యోగ్యత ఉందో లేదో చూడనవసరం లేదా? అందరికీ ఇది సాధ్యమేనా?

**దాదాశ్రీ:** నన్ను ఎవరైనా, 'నేను అందుకు యోగ్యుడనేనా?' అని అడిగితే నేను, 'నన్ను కలిసావు కనుక మీరూ యోగ్యులే' అంటాను. ఇలా కలవటమనేదాని వెనుక సైంటిఫిక్ సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ ఉంది. అందువలన నన్ను ఏ వ్యక్తి కలిసినా అతను యోగ్యుడే అని అనుకోవటం జరుగుతుంది. ఎవరైతే కలవలేదో వాళ్ళు యోగ్యులు కారు. వాళ్ళు దేని వలన కలుస్తారు? వాళ్ళు అందుకు యోగ్యులు కనుకనే నన్ను కలుస్తారు. నన్ను కలిసిన తర్వాత కూడా ప్రాప్తించకపోతే, అది వారి అంతరాయ కర్మ అడ్డంకే.

## క్రమంలో చెయ్యటం ఉంటుంది, అక్రమంలో....

ఒకతను ఒకసారి, ఈ క్రమ, అక్రమలో ఏమిటి తేడా అని ప్రశ్నించాడు. అప్పుడు నేను సమాధానమిచ్చాను, క్రమ అంటే, అందరూ చెప్తారు చెయ్యగూడనివి (తప్పు) వదిలిపెట్టి, మంచి చేయమని. అందరూ ఇదే చెప్తుంటారు మళ్ళీ మళ్ళీ. ఇది క్రమ మార్గం. క్రమ అంటే అన్నిటినీ వదిలేయమని అంటారు. చెడ్డదైన ఈ లోభాన్ని వదిలిపెట్టు, మంచి చెయ్యి అని. ఇదే కదా మీరు ఇంతవరకు చూసింది? ఈ అక్రమ అంటే అందులో చెయ్యాల్సింది ఏమీ లేదు. కరోమి, కరోసి, కరోతి అనేవేమీ లేవు. జేబు కత్తిరించినట్లయితే అక్రమ్‌లో, 'అతను కత్తిరించలేదు, నాదేమీ కట్ అవలేదు' అంటారు. అదే క్రమలో అయితే, 'అతను కత్తిరించాడు, నాది కట్ అయింది' అంటారు.

ఈ అక్రమ విజ్ఞానం లాటరీవంటిది. లాటరీలో బహుమతి వస్తే, దాని కోసం మీరేమైనా కష్టపడ్డారా? రూపాయిని అతనూ చెల్లించాడు, ఇతరులు కూడా చెల్లించారు కానీ, అతని పాచిక పారింది. అలాగే ఈ అక్రమ విజ్ఞానం, తక్షణ మోక్షం ఇప్పిస్తుంది. నగదే.

## అక్రమంలో ఆమూల పరివర్తన

అక్రమ విజ్ఞానం గొప్ప ఆశ్చర్యకరమైనదనిపించుకుంటుంది. ఈ జ్ఞానం తీసుకున్న తర్వాత రెండవ రోజు నుంచే ఆ వ్యక్తిలో పరివర్తన వస్తుంది. వింటూనే ఈ విజ్ఞానం మనుషులకు సమ్మతి అవుతుంది. ఇక్కడికి లాక్కునిరాబడతారు.

## ప్రపంచవ్యాప్తంగా అక్రమ మార్గం

ఈ సంయోగం ఉత్కృష్టమైనది. ఇలా ఎక్కడా జరగలేదు. ఒకే వ్యక్తి కేవలం 'దాదాజీ' ఈ పని చేయగలిగారు. మరెవరూ ఇది చేయలేరు.

**ప్రశ్నకర్త:** ఇది దాదాజీ కృప కదా?

**దాదాశ్రీ:** ఈ మార్గం నడుస్తూనేవుంటుంది. నేను కోరుకునేది ఏమిటంటే, ఏదైతే తయారౌతుందో, ఆ మార్గాన్ని ఆ తర్వాత నడిపేవారు ఉండాలి కదా?

**ప్రశ్నకర్త:** ఉండాలి.

**దాదాశ్రీ:** కానీ, నా కోరిక ఈడేరుతుంది.

**ప్రశ్నకర్త:** 'అక్రమ విజ్ఞానం' ఒకవేళ ముందుకు సాగితే, అది నిమిత్తంతో నడుస్తుంది.

**దాదాశ్రీ:** అక్రమ విజ్ఞానమే నడుస్తుంది. అక్రమ విజ్ఞానం సంవత్సరం రెండు సంవత్సరాలు ఇలా నడిచినట్లయితే, ప్రపంచమంతా దీని గురించే మాట్లాడుకుంటారు, అన్ని ప్రదేశాలకు చేరుకుంటుంది. ఎలాఅయితే అబద్ధపు మాటలు తలకెక్కుతాయో, అలాగే సత్యవాక్కులు కూడా తలకెక్కుతాయి. సత్యవాక్కుల అమలులో ఆలస్యం జరుగుతుంది, అబద్ధం త్వరగా అమలౌతుంది.

## అక్రమ ద్వారా స్త్రీకి కూడా మోక్షం

మోక్షమనేది పురుషులకేనని, స్త్రీకి మోక్షం లేదని అంటారు. ఈ విషయంలో నేను వాళ్ళతో, స్త్రీలకు కూడా మోక్షం లభిస్తుందని అంటాను. ఎందుకు రాదు? అప్పుడు వాళ్ళు ఏమంటారంటే, ఆడవాళ్ళకి కపటం, మోహాలకు సంబంధించిన గ్రంథి పెద్దదని. పురుషులకు ముడి చిన్నగా ఉంటే, వాళ్ళకి కందంత పెద్దగా ఉంటుందని అంటారు.

స్త్రీ కూడా మోక్షానికి వెళ్తుంది. ఎవరు కాదన్నా స్త్రీకి మోక్షం పొందే యోగ్యత ఉంది. ఎందుకంటే ఆమె ఆత్మ కాబట్టి. పురుషులతో సంపర్కంలోకి రాబట్టి, వాళ్ళకి కూడా మార్గం దొరుకుతుంది. కాకపోతే ఆమె ప్రకృతిలో మోహం బలమైనదైనందు వలన ఎక్కువ టైం పడుతుంది.

## పని నెరవేర్చుకోండి

మీ పనిని జరిపించుకోండి, మీకు అవసరం వచ్చినపుడు. మీరు రావాలనికూడా ఏమీ లేదు. మీకు బాగనిపిస్తే రండి. ప్రపంచాన్ని ఎప్పటివరకు ఇష్టపడతారో, అనుకూలంగా ఉంటుందో, అప్పటివరకు మీ వ్యాపారాన్ని కొనసాగిస్తుండండి. మీరు ఇలాగే చెయ్యండి అని మాకేమీ లేదు. మేము మీకు ఉత్తరం కూడా రాయము. ఇక్కడికి వస్తేనే మేము మీకు, 'బాబూ ఇక్కడ లాభాన్ని పొందండి' అని చెప్తాము. ఇంతే చెప్తాం మీకు. వేల సంవత్సరాలుగా ఇలాంటి విజ్ఞానం బయటకు రాలేదు. అందువలన నేను చెప్పేదేమిటంటే, తర్వాత ఏం జరిగితే అది జరగనీ కానీ ఇది మాత్రం పని నెరవేరేది.

## 9) జ్ఞాని పురుష్ ఎవరు?
## సంత్ పురుష్ : జ్ఞాని పురుష్

**ప్రశ్నకర్త:** వీళ్ళంతా సంత్‌లయినవాళ్ళున్నారు కదా, వాళ్ళకి, జ్ఞానికి మధ్య తేడా ఏమిటి?

**దాదాశ్రీ:** సంత్ అని ఎవరిని అంటారు? చెడుని వదిలించి, మంచిని నేర్పించేవాళ్ళని. చెడు చేయటాన్ని వదిలించి, మంచిని చేయటం నేర్పేవాళ్ళను సంత్ అంటారు.

**ప్రశ్నకర్త:** అంటే, పాప కర్మ నుంచి రక్షించేవారా సంత్ అంటే?

**దాదాశ్రీ:** ఔను. పాప కర్మ నుంచి రక్షించేవారే సంత్. కానీ, పాపం, పుణ్యం, రెండిటి నుంచీ రక్షించేవారిని జ్ఞాని పురుష్ అంటారు.

సంత్ పురుష్ సరైన మార్గంలోకి పెడతారు, జ్ఞాని పురుష్ ముక్తిన్నిప్పిస్తాడు. సంత్ బాటసారిలాంటివాడు. తోటి బాటసారితో, 'నాతోపాటు నడవ' మని అంటాడు. జ్ఞాని పురుష్ అయితే ఆఖరి స్టేషన్‌లాంటివాడు. కనుక, అతను మన పనిని కూడా నెరవేరుస్తాడు.

నిజమైన, పూర్తిగా నిజమైన సంత్ ఎవరు? మమతా అనేది లేకుండా ఉ ండేవాడు. ఇతరులకు కాస్తోకూస్తో మమతా అనేది ఉంటుంది. నిజమైన జ్ఞాని ఎవరు? అహంకారం, మమతా అన్నవి రెండూ లేనివాడు.

అందుకే సంత్ పురుషులను జ్ఞాని పురుష్ అని అనలేరు. సంత్‌లకు ఆత్మ గురించిన జ్ఞానం ఉండదు. ఆ సంత్‌లు కూడా జ్ఞాని పురుష్‌ని కలిసినపుడు వాళ్ళకి కూడా ముక్తి లభిస్తుంది. సంత్‌లకు కూడా దీని అవసరం ఉంటుంది. అందరూ ఇక్కడకు రావలసిందే. వేరే మార్గం లేదు కదా! ప్రతి ఒక్కరి ఇచ్ఛ ఇక్కడే ఉంది.

జ్ఞాని పురుష్‌ని ప్రపంచపు వింతలలో ఒకటి అని అంటారు. జ్ఞాని పురుష్‌ని ప్రకటితమైన దీపం అని అంటారు.

## జ్ఞానిపురుష్‌కి గుర్తింపు

**ప్రశ్నకర్త:** జ్ఞాని పురుష్‌ని ఎలా గుర్తించవచ్చు?

**దాదాశ్రీ:** ఎలా గుర్తిస్తారు? జ్ఞాని పురుష్ ఎలా ఉంటారంటే వాళ్ళని ఇట్టే గుర్తించవచ్చు. వారి సువాసనతోనే గుర్తించవచ్చు. వాళ్ళున్న వాతావరణమే వేరే విధంగా ఉంటుంది. వారి వాక్కు కూడా వేరే విధంగా ఉంటుంది. వాళ్ళ మాటలతోనే అర్థమౌతుంది. అరె, వాళ్ళ కళ్ళను చూస్తేనే తెలుస్తుంది. జ్ఞాని దగ్గర అధిక విశ్వసనీయత ఉంటుంది, చాల ఎక్కువ విశ్వసనీయత! వాళ్ళ ప్రతి మాట శాస్త్రరూపంలో ఉంటుంది. అర్థం చేసుకుంటే వాళ్ళ వాణి, ప్రవర్తన, వినయం మనోహరంగా ఉంటాయి. మనసుని హరించేవిగా ఉంటాయి. ఇలాంటి లక్షణాలు మరెన్నో ఉంటాయి.

జ్ఞాని పురుష్‌లో బుద్ధి లేశమంతైనా ఉండదు. అబుద్ధిని కలిగివుంటారు. లేశమంతైనా బుద్ధి లేని అటువంటి మనుషులు ఎంతమంది ఉంటారు? బహుశా ఏదో ఒక జన్మలో అలాంటివారు ఉండవచ్చు. అప్పుడు లోకకళ్యాణం జరుగుతుంది. అప్పుడు లక్షలాదిమంది (సంసార సాగరాన్ని) ఈది బయటపడతారు. జ్ఞాని పురుష్ అహంకార రహితులైవుంటారు. ఏమాత్రం అహంకారం ఉండదు. అహంకార రహితులై జీవించేవారు ఈ ప్రపంచంలో ఇప్పుడు ఎవరూ లేరు. కేవలం జ్ఞాని పురుష్ మాత్రం అహంకార రహితంగా ఉంటారు.

వేల సంవత్సరాలలో ఒకరో అరో జ్ఞాని పురుష్ జన్మిస్తారు. ఇక మిగిలిన సంత్‌లు, శాస్త్రజ్ఞానం కలిగినవారు అనేకమంది ఉంటారు. మన దగ్గర శాస్త్రజ్ఞానం కలిగినవారు చాలమంది ఉన్నారు కాని ఆత్మజ్ఞానులు లేరు. ఆత్మజ్ఞానం కలిగినవారు పరమ సుఖాన్ని అనుభవిస్తూవుంటారు. వారికి ఏమాత్రం కూడా దు:ఖమనేది ఉండదు. అందుకే అక్కడ మనకి శుభం కలుగుతుంది. తనకు తాను ఉద్ధరించుకున్నవారే మనకి శుభాన్ని చేకూరుస్తాడు. గట్టు దాటినివారు మాత్రమే మనలను గట్టు దాటిస్తారు. అలాకాకుండా, తనే మునిగిపోతున్నవాడు ఇతరులను ఒడ్డు దాటించలేడు.

## 10) దాదా భగవాన్ ఎవరు?
## 'నేను', 'దాదా భగవాన్', ఒకరు కాదు బాబూ

**ప్రశ్నకర్త:** మీరు భగవాన్ అని ఎందుకు పిలిపించుకుంటారు?

**దాదాశ్రీ:** నేను భగవాన్‌ని కాను. భగవాన్‌కి, 'దాదా భగవాన్' కైతే నేను నమస్కరిస్తాను. నేనే మూడువందల యాభైఆరు డిగ్రీలలో ఉన్నాను, 'దాదా భగవాన్' మూడువందల అరవై డిగ్రీలలో ఉన్నారు. నేను నాలుగు డిగ్రీలు తక్కువలో ఉన్నాను. అందువలన నేను 'దాదా భగవాన్' కి నమస్కరిస్తాను.

**ప్రశ్నకర్త:** ఎందుకలా?

**దాదాశ్రీ:** ఎందుకంటే నేనింకా నాలుగు డిగ్రీలను పూర్తిచేసుకోవాలి. నేను పూర్తయితే చేసుకోవాలి కదా! నాలుగు డిగ్రీలు తక్కువై పాసవలేదు. పాసవకుండా ముక్తి కలుగుతుందా ఏమిటి?

**ప్రశ్నకర్త:** మీకు భగవాన్ అవాలనే మోహం ఉందా?

**దాదాశ్రీ:** నాకైతే భగవాన్ అవటమనేది చాల పెద్ద భారంలా అనిపిస్తుంది. నేను చాల చిన్న మనిషిని. ఈ ప్రపంచంలో నాకెంటే చిన్న ఎవరూ లేరు. అంత బాగా చిన్నవాడిని. అంటే, భగవాన్ అవటం నాకు భారంలా అనిపిస్తుంది, కాని సిగ్గు కూడా కలుగుతుంది.

**ప్రశ్నకర్త:** నాలుగు డిగ్రీలను పూర్తి చేయదలచుకోకపోతే పురుషార్థం చేయటం ఎందుకు?

**దాదాశ్రీ:** అది, నేను మోక్షం పొందటానికి. నేను భగవాన్ అయి చేసేదేముంది? భగవానైతే, ఎవరిలో భగవద్గుణాలున్నాయో, వాళ్ళంతా భగవానే. 'భగవాన్' అనే పదం విశేషణం. దానికి యోగ్యులైన వ్యక్తిని మనుషులు భగవాన్ అంటారు.

## పదునాలుగు లోకాలకు నాథుడు ఇక్కడ ప్రకటితమయ్యాడు

**ప్రశ్నకర్త:** 'దాదా భగవాన్' అనే పదాన్ని ఎవరికి ఉపయోగిస్తారు?

**దాదాశ్రీ:** 'దాదా భగవాన్' కి. నాకు కాదు. నేనైతే జ్ఞాని పురుష్‌ని.

**ప్రశ్నకర్త:** ఏ భగవాన్?

**దాదాశ్రీ:** పధ్నాలుగు లోకాలకు నాథుడైన 'దాదా భగవాన్'. ఆయన మీలోనూ ఉన్నాడు కానీ మీలో ప్రకటితమవలేదు. మీలో అవ్యక్తరూపంలో ఉన్నాడు, ఇక్కడ వ్యక్తమయ్యాడు. వ్యక్తమైనవాడు ఫలితాలనివ్వగలుగుతాడు. ఒకసారి ఆయన పేరు తలచుకుంటేనే మీరు అనుకున్న పనులు నెరవేరేంత. కాని, ఆయనను గుర్తించి తలచుకుంటే కళ్యాణం జరుగుతుంది, ప్రాపంచిక విషయాలలో ఉన్న అడ్డంకులు కూడా దూరమౌతాయి. కానీ, అందులో లోభం ఉండగూడదు. లోభపడితే పూర్తే అవవు. మీకు అర్థమైందా 'దాదా భగవాన్' ఎవరో?

కంటికి కనిపించేది కాదు 'దాదా భగవాన్' అంటే. కంటికి కనిపిస్తున్నవారిని 'దాదా భగవాన్' అనుకుంటున్నారేమో. కాదు. ఇక్కడ కనిపించేవారు భాదరణ గ్రామ పటేలు. నేనైతే జ్ఞాని పురుష్‌ని. 'దాదా భగవాన్' అంటే లోపల కూర్చున్నవాడు. లోపల ప్రకటితమైవున్నాడే అతను. పధ్నాలుగు భువనాల అధిపతి ప్రకటితమైవున్నాడు. ఆయన్ని నేను స్వయంగా చూసాను. స్వయంగా అనుభూతిచెందాను. అందువలనే నేను గ్యారెంటీగా చెప్తాను ఆయన లోపల ప్రకటితమైవున్నారని.

మరి ఈ మాటలు ఎవరు చెప్తున్నారు? 'టేప్ రికార్డర్' మాట్లాడుతూవుంది. ఎందుకంటే 'దాదా భగవాన్' కి మాట్లాడే శక్తి లేదు. ఈ పటేలు మాత్రం టేప్‌రికార్డర్ సాయంతో మాట్లాడుతాడు. ఎందుకంటే, 'భగవాన్', పటేలు

వేరైవున్నారు. అందువలన అక్కడ అహంకారానికి తావులేదు. మాట్లాడే ఈ టేప్‌రికార్డర్‌ని నేను జ్ఞాతద్రష్టగా చూస్తాను. మీ టేప్‌రికార్డర్ కూడా పలుకుతుంది. కానీ, మీ మనసులో గర్వరసం ఉత్పన్నమై, 'నేను మాట్లాడుతున్నాను' అనుకుంటారు. ఇక నాకు కూడా దాదా భగవాన్‌కి నమస్కరించవలసిన అవసరం ఉంటుంది. దాదా భగవాన్ తోడుండటమంటే అది, మనలో వేర్పాటుతన వ్యవహారమే. ఆ వ్యవహారమే వేర్పాటుతనం. కానీ మనుషులు, స్వయంగా నేను దాదా భగవాన్ ని అనుకుంటారు. అలా కాదు. స్వయంగా దాదా భగవాన్ ఎలా అవగలను? ఈయనైతే భాదరణ గ్రామానికి పటేలు మాత్రమే.

## 11) అక్రమ మార్గం తెరుచుకునేవుంది వెనుక జ్ఞానుల వంశావళి

మా వెనక జ్ఞానుల వంశావళిని వదిలివెళ్తాం. మా ఉత్తరాధికారిని వదిలివెళ్తాం. ఆ తర్వాత జ్ఞానుల లింకు ముందుకు సాగిపోతుంది. కనుక సంజీవన్ మూర్తిని వెతకండి. అతను లేకుండా పని జరిగేటట్లుగా లేదు.

నేను నా చేత్తో కొందరికి సిద్ధి ప్రదానం చేయబోతున్నాను. నా తర్వాత ఎవరైనా ఉండాలా వద్దా? నా తర్వాత మనుషులకు మార్గం చూపించేవారు కావాలి కదా?

## జగత్తు సమ్మతించినవారిదే సాగుతుంది

**ప్రశ్నకర్త:** మీ వెనక నలభై యాభై వేలమంది ఏడ్చేవాళ్ళుంటారు కానీ శిష్యులు ఒక్కరూ ఉండరని మీరంటారు. దానితో మీరు చెప్పదలచుకున్నదేమిటి?

**దాదాశ్రీ:** నాకు శిష్యులంటూ ఎవరూ ఉండరు. ఇదేమీ సింహాసనం కాదు. సింహాసనం ఉంటేనే కదా వారసులుండేది! ఎవరైనా బంధువులు వారసులైవస్తారు కదా! ఇక్కడ ఎవరినైతే స్వీకరించటం జరుగుతుందో వారి మాటే నడుస్తుంది. అందరికీ శిష్యులైనవారి మాట చెల్లుతుంది. ఇక్కడైతే ఎవరిని

మనుషులు స్వీకరిస్తారో వారి మాటే చెల్లుతుంది. అతి చిన్నవాళ్ళు ఎవరైతే ఉంటారో వాళ్ళనే జగత్తు ఆమోదిస్తుంది.

## 12) ఆత్మదృష్టి కలిగిన తర్వాత ఆత్మ ప్రాప్తి లక్షణాలు

'జ్ఞానం' లభించక ముందు మీరు చందూలాల్. ఇప్పుడు జ్ఞానం తీసుకున్న తర్వాత శుద్ధాత్మ అయ్యారు. మరి ఆ అనుభవం వలన ఏమైనా తేడా తెలుస్తోందా?

**ప్రశ్నకర్త:** ఔనండి.

**దాదాశ్రీ:** 'నేను శుద్ధాత్మను' అనే భావం మీకు ఎంతసేపు ఉంటుంది?

**ప్రశ్నకర్త:** ఏకాంతంలో ఒంటరిగా ఉన్నప్పుడు.

**దాదాశ్రీ:** ఆహా. మరి ఎలాంటి భావం ఉంటుంది? మీకు ఎప్పుడైనా, 'నేను చందూలాల్‌ని' అనే భావం కలుగుతుందా? మీరు నిజానికి 'చందూలాల్' అనే భావం కలిగిందా ఎప్పుడైనా?

**ప్రశ్నకర్త:** జ్ఞానం తీసుకున్న తర్వాత కలుగలేదు.

**దాదాశ్రీ:** అయితే మీరు శుద్ధాత్మే. మనిషిక ఒకే భావం ఉండ గలుగుతుంది. అంటే, 'నేను శుద్ధాత్మని' అని మీకు నిరంతరం ఉంటుంది.

**ప్రశ్నకర్త:** కానీ, చాలసార్లు వ్యవహారంలో పడ్డప్పుడు శుద్ధాత్మని అనే భావం ఉండదు.

**దాదాశ్రీ:** మరి 'నేను చందూలాల్‌ని' అనే భావం ఉంటుందా? మూడు గంటలసేపు శుద్ధాత్మ అనే భావంలో లేకుండా ఉంటే, ఆ తర్వాత మిమ్మల్ని, 'మీరు చందాలాలా లేక శుద్ధాత్మా?' అని అడిగితే మీరు ఏం చెప్తారు?

**ప్రశ్నకర్త:** శుద్ధాత్మ.

**దాదాశ్రీ:** అంటే, ఆ ధ్యాస ఉంది. ఎవరైనా సేర్ మద్యం సేవించివుంటే, ఆ సమయంలో అతని ధ్యాస అతనికి ఉండకుండా పోతుంది. కానీ తాగిన మైకం తగ్గిన తర్వాత....

**ప్రశ్నకర్త:** తిరిగి జాగృతమౌతారు.

**దాదాశ్రీ:** అలాగే ఇది కూడా రెండవ, బయటి ప్రభావం.

నేను మిమ్మల్ని, 'మీరు చందూలాలా లేక శుద్ధాత్మా?' అని అడిగితే, 'నేను శుద్ధాత్మని' అంటారు మీరు. రెండవరోజు మళ్ళీ, 'నిజంగా మీరు ఎవరు?' అని అడిగితే, 'శుద్ధాత్మని' అంటారు. ఐదు రోజుల వరకు అలా నేను అడుగుతూనేపోతే, ఆ తర్వాత మీ తాళం చెవి నా దగ్గరుంది అని నాకు అర్థమౌతుంది. ఆ తర్వాత మీరు నా మీద ఆరోపణ చేసినా నేను వినను- మీరు ఆరోపిస్తూపోతున్నా సరే.

## కలిగిందొక అపూర్వమైన స్పృహ

దాన్నే శ్రీమద్ రాజచంద్రజీ ఇలా చెప్పారు, "**सदगुरुना उपदेशथी आव्युं अपूर्वभान, निजपद निजमांही लह्यु, दूर थयुं अज्ञान**" (సద్గురు ఉపదేశంతో అపూర్వమైన స్పృహ, నిజస్థితి, నిజ జనని తెలిసి, అజ్ఞానం దూరమైంది). మొదట్లో దేహధ్యాస మాత్రమే స్పృహలో ఉండేది. మొదట్లో శరీర స్పృహ తప్ప మరేమీ ఉండేది కాదు. ఆ అపూర్వమైన స్పృహ, ఆత్మ స్పృహ నాకు లభించింది. నా అసలు స్థితి ఏమిటంటే, 'నేను చందూలాల్‌ని' అనేవాడిని ఇప్పుడు నా అసలు 'నేను' లోకి వచ్చేసాను. అసలు స్థితి అసలు చోట స్థిరపడింది. అలాగే 'నేను చందూలాల్‌ని' అనే అజ్ఞానం దూరమైంది.

## దాన్నే దేహ ధ్యాస అంటారు

జగత్తులో దేహ ధ్యాస నుంచి ముక్తులవటం తన స్వస్వరూపంలో ఉండటం జరిగే పనికాదు. మీరు మీ స్వస్వరూపంలో ఉండటమంటే అహంకారం, మమత రెండు పోయినట్లు. 'నేను చందూలాల్‌ని' అనేది దేహ ధ్యాస. ఎప్పుడైతే 'నేను

శుద్ధాత్మను' అనే లక్ష్యం సిద్ధిస్తుందో (ఎరుక కలుగుతుందో) అప్పటి నుంచి వేరే విధమైన ఏ ధ్యాసా ఉండదు. ఇక అప్పుడేమీ ఉండదు. అయినా ఎప్పుడైనా తప్పు జరిగినట్లయితే బాధ కలుగుతుంది.

## శుద్ధాత్మ స్థితి శుద్ధమైనదే

కనుక, ఈ 'జ్ఞానం' తీసుకున్న తర్వాత, అందుకు ముందు ఉండే 'నేను చేస్తున్నాను' అనే భ్రాంతి ఏదైతో ఉందో ఆ భావం వీడిపోతుంది. అంటే, 'శుద్ధమైవున్నాను' అనే భావం ఉంటుంది కాబట్టే 'శుద్ధాత్మ' అనటం జరిగింది. ఎవరితోనైనా ఏమైనా జరిగి, 'చందూలాల్' తిట్లకి లంకించుకున్నా, మీరు పరిశుద్ధంగానే ఉంటారు. ఇక చందూలాల్‌కి 'మనం' ఏం చెప్పాలంటే, 'బాబూ, ఎవరికైనా బాధ కలిగించే అతిక్రమణ ఎందుకు చేస్తావు? కనుక ప్రతిక్రమణ చెయ్యి' అని.

ఎవరికైనా బాధ కలిగించే విధంగా మాట్లాడినట్లయితే, దాన్ని 'అతిక్రమణ చెయ్యటం' అంటారు. అప్పుడు దానికి ప్రతిక్రమణ చెయ్యాలి.

ప్రతిక్రమణ అంటే, మీకు అర్థమైన విధంగా వాళ్ళని క్షమాపణ కోరుకోవాలి. నేను ఇలాంటి తప్పు చేసాను అన్నది అర్థం చేసుకున్నాను, ఇక అలాంటి తప్పు మరోసారి చెయ్యను అనే నిర్ణయం తీసుకోవాలి. అలా చేసి తప్పుచేసాను. అలా జరిగివుండగూడదు. మరోసారి అలా చెయ్యను అని శపథం చేయాలి. అయినా తిరిగి అదే తప్పు మళ్ళీ మళ్ళీ జరుగుతుంటే, పశ్చాత్తాపపడాలి. కానీ తెలియగానే దాని గురించి పశ్చాత్తాపపడుతుంటే అది తగ్గిపోతుంటుంది. అలా చివరకు పూర్తిగా నశిస్తుంది.

**ప్రశ్నకర్త:** అంటే, (ఏ) వ్యక్తికోసమైనా ప్రతిక్రమణ ఎలా చెయ్యాలి?

**దాదాశ్రీ:** మనోవాక్కాయకర్మ, భావకర్మ– ద్రవ్యకర్మ– నౌకర్మ (ఆ వ్యక్తిది) పేరు, అతని పేరుతో ఉన్న మాయల నుండి భిన్నం అనే తన శుద్ధాత్మను

గుర్తుచేసుకోవాలి, తర్వాత తనచేత జరిగిన తప్పులను గుర్తుచేసుకోవాలి (ఆత్మవిమర్శ), 'ఆ తప్పులకు నేను పశ్చాత్తాప పడుతున్నాను. అందుకు నన్ను క్షమించండి (ప్రతిక్రమణ), అటువంటి తప్పులను ఎన్నడూ చేయనని ధృఢ నిశ్చయం చేసుకుంటున్నాను' అని నిర్ణయం చేసుకోవాలి (ప్రత్యాఖ్యానం). 'మీరు' స్వయంగా 'చందూలాల్' అనే దృష్టితో చూడండి ఎన్ని ప్రతిక్రమణలు చేసారన్నది, ఎంత బాగా చేసారు, ఎన్నిసార్లు చేసారు అన్నది.

## ప్రజ్ఞ లోపలి నుంచి సచేతనాన్ని తీసుకునివస్తుంది

అదొక విజ్ఞానం. అందుకే మనకి దాని అనుభవం కలుగుతుంది. లోపలి నుంచి కూడా సచేతనాన్ని తెచ్చుకోవాలి. అక్కడ (క్రమ విధానంలో) మనం చెయ్యవలసి వుంటుంది. కాని ఇక్కడ లోపలి నుంచే సచేతనాన్ని కొనితెచ్చుకోవాలి.

**ప్రశ్నకర్త:** ఇప్పుడీ అనుభవం అయింది కనుక లోపలి నుంచి హెచ్చరికలు వస్తుంటాయి.

**దాదాశ్రీ:** మనకిప్పుడు ఈ మార్గం లభించింది, శుద్ధాత్మకున్న బౌండ్రీ (సరిహద్దు) తెలిసింది, మొదటి ద్వారంలోకి ప్రవేశం లభించింది. అక్కడి నుండి ఎవరూ మనల్ని బయటకు లాగలేరు. ఎవరికైనా (మనకి) బయటకు లాగే అధికారం లేదు. అటువంటి ప్రదేశంలోకి మీరు ప్రవేశించారు!

మళ్ళీ మళ్ళీ మనల్ని హెచ్చరించేదెవరు? ప్రజ్ఞ. 'జ్ఞాన' ప్రాప్తి లేకుండా ప్రజ్ఞ ప్రారంభమే కాదు. ఒకవేళ సమకీత లభించిందంటే, ప్రజ్ఞ ప్రారంభమౌతుంది. సమకీతలో ప్రజ్ఞ ఎలా ప్రారంభమౌతుంది? విదియనాటి చంద్రునిలా ప్రారంభమౌతుంది. మీలో పూర్ణ ప్రజ్ఞ ఉత్పన్నమౌతుంది. ఫుల్ (పూర్ణ) ప్రజ్ఞ అంటే అది మోక్షానికి తీసుకునివెళ్ళేందుకే హెచ్చరిస్తుంటుంది. భరత రాజుకి ఒకరిని, హెచ్చరించేందుకు పెట్టుకోవలసివచ్చింది, నౌకరుని పెట్టుకోవలసివచ్చింది. అతను ప్రతి పదిహేను నిమిషాలకోసారి, 'భరత రాజా, మేలుకో, మేలుకో మేలుకో' అని మూడుసార్లు పిలిచేవాడు. చూడండి, మిమ్మల్ని

లోపలి నుంచే ప్రజ్ఞ హెచ్చరిస్తుంటుంది. ప్రజ్ఞ నిరంతరం హెచ్చరిస్తూనేవుంటుంది, 'ఏయ్ అలా వద్దు' అంటూ. రోజంతా హెచ్చరిస్తూనేవుంటుంది. ఇదే ఆత్మానుభవం. నిరంతరం, రోజంతా ఆత్మానుభవం!

## లోపల అనుభవమైతే ఉంటుంది

మేము 'జ్ఞానం' ఇచ్చిన రోజున, రాత్రి కలిగే అనుభవం ఇక వీడిపోదు. అదెలా పోతుంది? మేము 'జ్ఞానం' ఇచ్చిన రోజున రాత్రి కలిగే అనుభవం ఎల్లకాలం ఉండేది. కానీ కర్మ మిమ్మల్ని మళ్ళీ చుట్టుముట్టుతుంది. పూర్వకర్మ ఏదైతై అనుభవించేందుకు మిగిలివుందో అది 'వసూలు చేసుకోవటానికి వచ్చేది', మిమ్మల్ని పట్టుకుంటుంది. దానికి నేనేం చెయ్యను?

**ప్రశ్నకర్త:** కాని, దాదాజీ, ఇప్పుడు అంత *భోగవటా* (సుఖదుఖాల ప్రభావం, వాటి అనుభవం) ఉండదు.

**దాదాశ్రీ:** లేదు, అది ఉండదన్నది వేరు. కానీ వసూళ్ళు చేసేవారు ఎక్కువగా ఉంటే వాళ్ళని ఎక్కువమంది చుట్టుముట్టేస్తారు. ఐదుగురుంటే ఐదుగురు, ఇద్దరుంటే ఇద్దరు, ఇరవైమంది ఉంటే ఇరవైమంది. నేను మిమ్మల్ని శుద్ధాత్మ స్థితిలో కూర్చోబెట్టాను. కానీ తర్వాత రోజునుంచే అడిగేవాళ్ళు వస్తే కాస్త సఫొకేషన్ అవుతుంది.

## ఇక ఏం మిగిలిపోయింది?

అది క్రమ విజ్ఞానం, ఇది అక్రమ విజ్ఞానం. ఈ జ్ఞానం వీతరాగులది. జ్ఞానంలో తేడా లేదు. మేము జ్ఞానం ఇచ్చిన తర్వాత మీకు ఆత్మానుభవం కలుగుతుంది, అప్పుడిక మిగిలిపోయేది ఏముంటుంది? జ్ఞాని పురుష్ 'ఆజ్ఞా' పాలన చేయాలి. ఆ 'ఆజ్ఞయే' ధర్మం, ఆ 'ఆజ్ఞయే' తపం. మా 'ఆజ్ఞ' ప్రాపంచిక వ్యవహారాలలో ఎటువంటి అడ్డంకులనూ కలిగించదు. ప్రపంచంలో ఉంటూనే, ప్రాపంచికం అంటకుండా ఉండటం జరుగుతుంది, అటువంటిది ఈ అక్రమ విజ్ఞానం.

ఏకావతారి అవాలి అనుకుంటే మేము చెప్పినదాని ప్రకారం ముందుకు నడువరాదా! కాబట్టి ఈ విజ్ఞానం ఏకావతారి. ఈ విజ్ఞానం ఉంది కానీ, ఇక్కడి నుండి నేరుగా మోక్షంలోకి వెళ్ళగలిగేది కాదు.

## మోక్షమార్గంలో ఆజ్ఞ ఇదే ధర్మం

మోక్షానికి వెళ్ళదలచుకున్నవాళ్ళకి క్రియలతో పనిలేదు. దేవగతికి పోదలచుకున్నవాళ్ళకి జ్ఞానం, జ్ఞాని ఆజ్ఞ, ఈ రెండిటి అవసరం పడుతుంది.

మోక్షమార్గంలో తపం– త్యాగం ఏమీ చేయవలసిన అవసరం లేదు. ఒకవేళ జ్ఞానపురుష్ లభిస్తే ఆ జ్ఞాని ఆజ్ఞయే ధర్మం, ఆజ్ఞయే తపం. అదే జ్ఞానం, దర్శనం, చారిత్ర, తపం అవుతుంది, దాని ప్రత్యక్ష ఫలితం మోక్షం అవుతుంది.

## జ్ఞాని సమీపంలో ఉండండి

జ్ఞాని మీద ప్రేమభావం ఎప్పుడూ రాలేదు. ప్రేమభావం వచ్చిందంటే పరిష్కారం దొరికినట్లే. ప్రతి జన్మలోను భార్యా పిల్లలు తప్ప వేరే ఇంకేమీ ఉండదు.

భగవాన్ చెప్పినట్లు, జ్ఞాని పురుష్ దగ్గర సమకిత ప్రాప్తించిన తర్వాత ఆ జ్ఞాని పురుష్ వెనకే పడిండి.

**ప్రశ్నకర్త:** వెనక పడటం అంటే ఏ అర్థంలో?

**దాదాశ్రీ:** వెనకపడటం అంటే ఈ జ్ఞానం లభించిన తర్వాత వేరే ఆరాధనలేమీ చెయ్యవద్దు. కానీ మాకు తెలుసు ఇది అక్రమమని. ఈ మనుషులంతా లెక్కలేనన్ని 'ఫైళ్ళు' తీసుకునివచ్చారు. అందువలన మిమ్మల్ని ఫైళ్ళ కోసం ముక్తులుగా ఉంచారు కాని దాని అర్థం పని పూర్తయిపోయిందని కాదు. ఈ కాలంలో ఫైళ్ళు చాలా ఉన్నాయి. అందువలన మిమ్మల్ని మా దగ్గర ఉంచుకుంటే మీ 'ఫైళ్ళను' పిలవటానికి వచ్చేస్తాము. అందువలన మీకు కలుగజేసిన వెసులుబాటు ఏమిటంటే, ఇంటికి వెళ్ళి, ఫైళ్ళను సమభావంతో పూర్తిచేయి. లేదంటే జ్ఞాని దగ్గరే ఉండిపోవలసివుంటుంది.

ఇక రాత్రింబవళ్ళు, మనసులో తొలిచివేస్తూనేవుండాలి, సంపూర్ణంగా లాభం పొందటంలేదేమా అని. ఫైళ్ళు ఉండవచ్చు కాని జ్ఞాని పురుష్ చెప్పారు కదా 'జ్ఞానం ఇచ్చాను, ఆ ఫైళ్ళను సమభావంతో పూర్తిచేయమని, అదే ఆజ్ఞ, అదే ధర్మమని? అదే నా ధర్మం. కానీ మనసులో ఇది గుచ్చుకుంటూనేవుండాలి ఈ ఫైళ్ళు తగ్గిపోవాలి, నేను లాభం పొందాలి అని.

## దానికోసమే మహావిదేహ క్షేత్రం ముందుకు వస్తుంది

శుద్ధాత్మ లక్ష్యం (జాగృతి) స్థిరపడ్డవారు ఈ భరతక్షేత్రంలో ఉండనేలేరు. ఆత్మ లక్ష్యం స్థిరపడ్డవారు మహావిదేహ క్షేత్రంలో చేరుకుంటారు అన్నదే నియమం. ఇక్కడ ఈ దుష్టసమయంలో ఉండనేలేరు. శుద్ధాత్మ లక్ష్యం స్థిరపడ్డవారు మహావిదేహ క్షేత్రంలో ఒకటి లేక రెండు జన్మలు తీసుకున్న తర్వాత, తీర్థంకరుల దర్శనం చేసుకుని, మోక్షానికి వెళ్ళిపోతారు. ఇది అంతటి సులభం, సరళమైన మార్గం! మా ఆజ్ఞలో ఉండండి. ఆజ్ఞయే ధర్మం, ఆజ్ఞయే తపం. సమభావంతో పనిపూర్తిచేసుకోవాలి. చెప్పిన ఆజ్ఞలలో ఎంతవరకు ఉండగలిగితే అంత ఉండు. పూర్తిగా ఉండగలిగితే భగవాన్ మహావీర్ వంటి స్థితిలో ఉండగలుగుతావు. 'రియల్', 'రిలేటివ్' గమనిస్తూవుండు. మీ చిత్తం వేరే చోటికి పోదు. ఆ సమయంలో మీ మనసులోకి ఏదైనా వస్తే ఆందోళనలో పడిపోతావు.

# 13) పంచాజ్ఞల మహత్తు

## జ్ఞానం తర్వాత సాధన ఏమిటి?

**ప్రశ్నకర్త:** ఈ జ్ఞానం తర్వాత ఎటువంటి సాధన చేయాలి?

**దాదాశ్రీ:** సాధన విషయానికి వస్తే, ఈ పంచాజ్ఞల పాలన చేస్తావు కదా అదే! ఇక వేరే సాధనేమీ చెయ్యవలసిన అవసరం లేదు. వేరే సాధన బంధనాన్ని కలిగిస్తుంది. ఈ పంచాజ్ఞలు విడిపించేవి.

## సమాధిని కలిగించే ఆజ్ఞలు

**ప్రశ్నకర్త:** మన ఈ పంచాజ్ఞలను దాటి మరేమైనా ఉన్నాయా?

**దాదాశ్రీ:** మీ లోపలి నుంచి సరుకుని ఎవరూ దొంగిలించకుండా ఉండేందుకు పంచాజ్ఞలు మీకు ఒక అడ్డుగోడ. ఈ అడ్డుగోడ వలన మీ లోపల మేమిచ్చింది ఎగ్జాక్ట్, అక్కడిది అక్కడే ఉంటుంది. అడ్డుగోడ బలహీనపడితే లోపలికి ఎవరైనా దూరి పాడుచేస్తారు. అప్పుడు దాన్ని రిపేరు చెయ్యటానికి నేను రావలసివస్తుంది. కనుక, ఈ పంచాజ్ఞలలో ఉన్నంత వరకు నిరంతర సమాధి గ్యారెంటీ మేము ఇస్తాము.

నేను పంచాజ్ఞలను మీ ప్రొటెక్షన్ కోసం ఇస్తాను. ఈ జ్ఞానాన్నయితే నేను మీకు ఇచ్చాను, 'భేదజ్ఞానం' తో 'వేరుచేసాను' కూడా. కాని ఇక అది వేరుగానే ఉండటం కోసం ప్రొటెక్షన్ ఇస్తాను. ఎందుకంటే ఈ కాలం, కలియుగంలోనిది, కలియుగంవాళ్ళే దాన్ని దోపిడీ చేయకుండా ఉండేందుకు. 'బోధబీజం' నాటిన తర్వాత నీళ్ళు అవీ చిలకరించాలి కదా? అడ్డుగా కంచెవేయాలి కదా?

## ఆజ్ఞాపాలనను ధృఢనిశ్చయంతో చేయండి

దాదా ఆజ్ఞాపాలన చేయాలి. అదే అన్నిటికన్నా పెద్దది. మా ఆజ్ఞాపాలన చెయ్యాలని నిశ్చయించుకోండి. ఆజ్ఞాపాలన జరుగుతున్నదా లేదా అన్నది మీరు చూడవద్దు. ఆజ్ఞాపాలనను ఎంత చేయగలిగితే అంతే చాలు. కానీ మనం నిశ్చయించుకోవలసింది, ఆజ్ఞాపాలన చేయాలని.

**ప్రశ్నకర్త:** పాలన కొద్దోగొప్పో జరిగితే పరవాలేదా?

**దాదాశ్రీ:** 'పరవాలేదు' అని కాదు. మీరు ఆజ్ఞాపాలన చెయ్యాలి అని నిశ్చయించుకోవాలి. ఉదయం నుంచే నిశ్చయం చేసుకోవాలి, 'పంచాజ్ఞలలో ఉండాలి, పాటించాలి' అని. అలా నిశ్చయం చేసుకున్న దగ్గరి నుంచే మా ఆజ్ఞలోకి వచ్చేస్తావు. నాకదే చాలు. పాలన జరగకపోతే అందుకు కాజెస్ (కారణం) నాకు తెలుసు. నేను పాటించాలి అనే నిశ్చయం చేసుకోవాలి.

మా జ్ఞానంతోనే మోక్షం వచ్చితీరుతుంది. ఆ ఆజ్ఞలలో వేరేవాళ్ళు ఎవరైనా ఉంటే వాళ్ళకి కూడా మోక్షం లభిస్తుంది. ఇందులో ఎటువంటి సంశయం లేదు. ఎవరైనా పాలన చెయ్యకపోతే. వాళ్ళు జ్ఞానం తీసుకునివుండివుంటే, అది ఎప్పుడో ఒకప్పుడు మొలకెత్తక మానదు. నన్ను అడుగుతుంటారు, 'జ్ఞానం తీసుకున్నవారిలో కొందరు ఆజ్ఞాపాలన చెయ్యకపోతే వాళ్ళ సంగతేమిటి?' అని. వాళ్ళతో నేను, 'అది మీరు చూడవలసింది కాదు. నేను చూడవలసింది. మీకేమీ నష్టమైతే లేదు కదా' అంటాను. ఎందుకంటే, (నా దగ్గరి నుంచి ఆజ్ఞ తీసుకున్న తర్వాత) పాపం భస్మీభూతమవక తప్పదు. లోపల జాగా ఖాళీ అయిపోయింది. మేమిచ్చిన ఈ పంచ వాక్యాలలో ఉంటే చేరుకుంటావు. నేను నిరంతరం పంచ వాక్యాలలోనే ఉంటాను. నేను ఉండే దశనే మీకు ఇవ్వటం జరిగింది. ఆజ్ఞలో ఉంటే పని జరుగుతుంది. మీ జ్ఞానంలో లక్షలాది జన్మలు తలబద్దలు కొట్టుకున్నా ఏమీ కాదు. ఆజ్ఞాపాలన కూడా వీళ్ళు తమ బుద్ధితో చేస్తుంటారు. మరి ఆజ్ఞలను తమ బుద్ధితోనే కదా అర్థం కూడా చేసుకుంటారు. అందువలన అక్కడ కూడా కొంచెం కొంచెం లీకేజ్ జరుగుతుంటుంది. కానీ ఆజ్ఞాపాలన చెయ్యటానికి వెనుక వాళ్ళ భావంలో 'ఆజ్ఞలను పాలించాల్సిందే' అనే ఉంటుంది కదా. కనుక జాగృతిలో ఉండాలి.

ఆజ్ఞాపాలన చెయ్యటం మర్చిపోతే ప్రతిక్రమణ చెయ్యండి. మర్చిపోవటం మానవ సహజం కదా. కానీ మర్చిపోయినందుకు ప్రతిక్రమణ చెయ్యాలి, 'హే దాదా, ఆ రెండు గంటలు మర్చిపోయాను, మీ ఆజ్ఞలను మర్చిపోయాను. కానీ నేను ఆజ్ఞాపాలన చెయ్యాలి. నన్ను క్షమించు'. అంతే పాతదంతా మాఫీ అయిపోతుంది. వందకి వంద మార్కులు పూర్తిగా. కనుక ఎవరి ప్రమేయమూ ఉండదు. ఆజ్ఞలోకి వచ్చినట్లయితే మొత్తం వర్ల్డ్ అతన్ని తాకలేదు. మా ఆజ్ఞాపాలన చేస్తే మిమ్మల్ని ఏదీ స్పర్శించదు. ఆజ్ఞ ఇచ్చినవాళ్ళని స్పర్శిస్తుందా? లేదు. ఎందుకంటే అది పరోపకారం కోసం చేసేది కనుక అది వారిని స్పర్శించదు, డిజాల్వ్ అయిపోతుంది.

## భగవాన్ ఆజ్ఞలు ఇవి

దాదా ఆజ్ఞలను పాటించటమంటే, ఈ ఆజ్ఞలు 'ఎ.ఎమ్.పటేల్' వి కావు. స్వయం పధ్నాలుగు లోకాల నాథుడైన దాదా భగవాన్ ఆజ్ఞలు. ఆ గ్యారెంటీ నేను ఇస్తాను. నేను మాధ్యమంగా ఈ మాటలు వెలువడుతున్నాయి. అందువలన మీరు ఈ ఆజ్ఞలను పాటించాలి. 'నా ఆజ్ఞ' కాదు. ఇవి దాదా భగవాన్ ఆజ్ఞలు. నేను కూడా భగవానుని ఈ ఆజ్ఞలలో జీవిస్తాను కదా!

**– జై సచ్చిదానంద**

# నిత్యక్రమం

## ఉదయం చేయవలసిన విధి

* శ్రీ సీమంధర స్వామికి నమస్కారాలు. (5)
* వాత్సల్యమూర్తి 'దాదా భగవాన్' కి నమస్కారాలు. (5)
* నాకు లభించిన మనోవాక్కాయకర్మలతో ఈ ప్రపంచంలోని ఏ జీవికీ ఏమాత్రమూ దుఖం కలుగకుండుగాక, కలుగకుండుగాక, కలుగకుండుగాక. (5)
* కేవలం శుద్ధాత్మ అనుభవం తప్ప ఈ ప్రపంచంలోని ఏ వినాశకరమైనదీ నాకు వద్దు. (5)
* ప్రకటిత జ్ఞాని పురుష్ దాదాభగవాన్ ఆజ్ఞలలోనే నిరంతరం ఉండేందుకు పరమ శక్తి కలుగుగాక, కలుగుగాక, కలుగుగాక. (5)
* జ్ఞాని పురుష్ 'దాదా భగవాన్' వీతరాగ విజ్ఞానాన్ని యదార్థ రూపంలో, సంపూర్ణ సర్వాంగ రూపంలో కేవల జ్ఞానం, కేవల దర్శనం, కేవల చారిత్రంలో పరిణామం జరగాలి, పరిణామం జరగాలి, పరిణామం జరగాలి.

## నమస్కార విధి

* ప్రత్యక్ష దాదా భగవాన్ సాక్షిగా, వర్తమానంలో మహావిదేహ క్షేత్రంలో చరించే తీర్థంకర్ భగవాన్ శ్రీ సీమంధర స్వామికి అత్యంత భక్తిపూర్వక నమస్కారాలు (40)
* ప్రత్యక్ష దాదా భగవాన్ సాక్షిగా, వర్తమానంలో మహావిదేహ క్షేత్రం మరి ఇతర క్షేత్రాలలో చరించే ఓం పరమేష్ఠి భగవంతులకు అత్యంత భక్తిపూర్వకంగా నమస్కారాలు. (5)
* ప్రత్యక్ష దాదా భగవాన్ సాక్షిగా, వర్తమానంలో మహావిదేహ క్షేత్రంలో మరి ఇతర క్షేత్రాలలో చరించే పంచ పరమేష్ఠి భగవంతులకు అత్యంత భక్తిపూర్వక నమస్కారాలు. (5)

* ప్రత్యక్ష దాదా భగవాన్ సాక్షిగా, వర్తమానంలో మహావిదేహ క్షేత్రంలో మరి ఇతర క్షేత్రాలలో విహరించే తీర్థంకర స్వాములకు అత్యంత భక్తిపూర్వక నమస్కారాలు. (5)

* వీతరాగ శాసన దేవీదేవతలకు అత్యంత భక్తిపూర్వక నమస్కారాలు. (5)

* నిష్పక్షపాత శాసన దేవీదేవతలకు అత్యంత భక్తిపూర్వక నమస్కారాలు. (5)

* ఇరవైనాలుగు తీర్థంకర భగవంతులకు అత్యంత భక్తిపూర్వక నమస్కారాలు. (5)

* శ్రీకృష్ణ భగవానునికి అత్యంత భక్తిపూర్వక నమస్కారాలు. (5)

* భరత క్షేత్రంలో సంచరించే సర్వజ్ఞ శ్రీ దాదా భగవాన్‌కి నిశ్చయంగా అత్యంత భక్తిపూర్వక నమస్కారాలు. (5)

* దాదా భగవాన్ సర్వ సమన్వితకర్తలైన మహాత్ములకు అత్యంత భక్తిపూర్వక నమస్కారాలు. (5)

* బ్రహ్మాండమంతటిలోని సమస్త జీవుల రియల్ స్వరూపానికి అత్యంత భక్తి పూర్వక నమస్కారాలు. (5)

* రియల్ స్వరూపమే భగవత్స్వరూపం కనుక, సమస్త విశ్వాన్ని భగవత్స్వరూపంగా దర్శిస్తాను. (5)

* రియల్ స్వరూపమే శుద్ధాత్మ స్వరూపం కనుక, సమస్త విశ్వాన్ని శుద్ధాత్మ స్వరూపంగా దర్శిస్తాను. (5)

* రియల్ స్వరూపమే తత్త్వ స్వరూపం కనుక, సమస్త విశ్వాన్ని తత్త్వజ్ఞాన రూపంగా దర్శిస్తాను. (5)

*(వర్తమాన తీర్థంకరులు శ్రీ సీమంధర స్వామికి పరమ పూజ్య దాదా భగవాన్ మాధ్యమం*

*ద్వారా ప్రత్యక్ష నమస్కారాలు చేరుతాయి. (బ్రాకెట్‌లో రాసిన సంఖ్యానుసారం, ప్రతి రోజు, అన్నిసార్లు చదవండి.)*

# నౌ కల్మే

(నవవిధ నివేదన)

1. హే దాదా భగవాన్! ఏ దేహధారి జీవాత్మ నుండి ఎంతమాత్రమైనా బాధ నన్ను తాకకుండుగాక, తాకకుండా చూసుకునే, తాకటానికి ఆమోదించకుండా ఉండగలిగే పరమ శక్తిని నాకు ప్రసాదించండి.

ఏ దేహధారి జీవాత్మ నుండి ఎంతమాత్రమైనా బాధ నన్ను తాకకుండునట్లుగా, నా వాణి సౌమ్యంగా, నా ప్రవర్తన సౌమ్యంగా, నా మనసులో ఆలోచనలు సౌమ్యంగా ఉంచుకోగల పరమ శక్తిని నాకు ప్రసాదించండి.

2. హే దాదా భగవాన్! ఏ మతానికి చెందిన ప్రమాణాలూ ఎంతమాత్రమైనా నన్ను తాకకుండుగాక, తాకకుండా చూసుకునే, తాకటానికి ఆమోదించకుండా ఉండగలిగే పరమ శక్తిని నాకు ప్రసాదించండి.

ఏ మతానికి చెందిన ప్రమాణాలూ ఎంతమాత్రమైనా నన్ను తాకకుండునట్లుగా, నా వాణి సౌమ్యంగా, నా ప్రవర్తన సౌమ్యంగా, నా మనసులో ఆలోచనలు సౌమ్యంగా ఉంచుకోగల పరమ శక్తిని నాకు ప్రసాదించండి.

3. హే దాదా భగవాన్! ఏ దేహధారి ఉపదేశక సాధు, సాధ్వీ, ఆచార్యుల పట్ల అవర్ణవాదం, అపరాధం, అవినయం చూపకుండా ఉండే పరమ శక్తిని ప్రసాదించండి.

4. హే దాదా భగవాన్! ఏ దేహధారి జీవాత్మ పట్ల ఏమాత్రమైనా అభావం, తిరస్కారం, నానుండి ఎప్పుడూ జరుగకుండా, జరిపించకుండా, కర్తగా ఆమోదించకుండా ఉండగలిగేటట్లుగా పరమ శక్తిని ప్రసాదించండి.

5. హే దాదా భగవాన్! నేను ఏ దేహధారి జీవాత్మ పట్ల ఎప్పుడూ కఠోరమైన పదజాలంతో, జగడాలమారి పదజాలంతో మాట్లాడకుండా, మాట్లాడించకుండా, లేదా మాట్లాడటానికి అనుమతినివ్వకుండా ఉండేటట్లుగా పరమ శక్తిని ప్రసాదించండి.

ఎవరైనా కఠోరంగా, తగవులాడే భాషలో మాట్లాడితే నేను మృదు సరళ భాషలో మాట్లాడేందుకు పరమ శక్తిని ప్రసాదించండి.

6. హే దాదా భగవాన్! నేను ఏ దేహధారి జీవాత్మ పట్ల, స్త్రీ, పురుష, నపుంసకులు ఏ లింగానికి చెందినవారైనా, వారితో ఉండే సంబంధంలో ఏమాత్రమైనా విషయ వికారాలలో దోషాలు, కోరికలు, చేష్టలు, లేక ఆలోచనలలో దోషాలు ఉండకుండా, అలా చేయించకుండా లేదా కర్తగా ఆమోదించకుండా ఉండే పరమ శక్తిని ప్రసాదించండి.

నేను నిరంతరం నిర్వికారంగా ఉండగల పరమ శక్తిని ప్రసాదించండి.

7. హే దాదా భగవాన్! నేను ఏ విధమైన ప్రత్యేక రుచికీ అలవాటుపడకుండా ఉండే శక్తిని ప్రసాదించండి.

సమరస ఆహారాన్ని తీసుకునే పరమ శక్తిని ప్రసాదించండి.

8. హే దాదా భగవాన్! ఏ దేహధారి జీవాత్మ పట్ల ప్రత్యక్ష, పరోక్ష, దేహధారి జీవించివున్నా, మరణించినా, ఎవరిపట్లనైనా ఏమాత్రమైనా అవర్ణవాదం, అపరాధం, అవినయానికి పాల్పడకుండా, అలా చేయించకుండా, లేక కర్తగా ఆమోదించకుండా ఉండగల పరమ శక్తిని ప్రసాదించండి.

9. హే దాదా భగవాన్! లోక కళ్యాణార్థం నిమిత్తునిగా తయారయ్యేందుకు నాకు పరమ శక్తిని ప్రసాదించండి, శక్తిని ప్రసాదించండి, శక్తిని ప్రసాదించండి.

## శుద్ధాత్మ ప్రతి ప్రార్థన

హే అంతర్యామి పరమాత్మా! మీరు ప్రతి ఒక్క జీవాత్మలో విరాజమానులైవున్నారు. అలాగే నాలోనూ విరాజమానులైవున్నారు. మీ స్వరూపమే నా స్వరూపం. నా స్వరూపం శుద్ధాత్మ.

హే శుద్ధాత్మ భగవాన్! నేను మీకు అభేద భావంతో అత్యంత భక్తిపూర్వక నమస్కారాలు.

అజ్ఞానంతో నేను చేసిన ** తప్పులు, ఆ తప్పులన్నిటినీ మీ సమక్షంలో స్పష్టీకరిస్తాను. వాటికి హృదయపూర్వకంగా ఎంతో పశ్చాత్తాపపడుతున్నాను, మీ క్షమాపణ కోరుకుంటున్నాను. హే ప్రభూ, నన్ను క్షమించండి, క్షమించండి, క్షమించండి. నేను తిరిగి అటువంటి తప్పు చేయకుండాఉండేందుకు నాకు శక్తిని ప్రసాదించండి, శక్తిని ప్రసాదించండి, శక్తిని ప్రసాదించండి.

హే శుద్ధాత్మ భగవాన్! మీ కృపతో మా భేదభావాలు వదిలిపోయి, అభేద స్వరూపం ప్రాప్తించుగాక. నేను మీతో అభేదరూపంతో తన్మయాకరంలో ఉండుగాక!

** ఏయే తప్పులు జరిగాయో వాటిని మనసులో అనుకోండి.

## జ్ఞాన సాక్షాత్కార ప్రాప్తి కోసం వ్యవహార విధి

ప్రకటిత 'జ్ఞాని పురుష్' దాదా భగవాన్‌కి అత్యంత భక్తితో నమస్కరిస్తున్నాను, నమస్కరిస్తున్నాను, నమస్కరిస్తున్నాను.

ప్రకటిత 'జ్ఞాని పురుష్' ద్వారా సత్యప్రాప్తి జరిగింది. వాటికి, సత్పురుషులకు అత్యంత భక్తితో నమస్కరిస్తున్నాను, నమస్కరిస్తున్నాను, నమస్కరిస్తున్నాను.

నిష్పక్షపాత 'దేవీదేవతలు' అందరికీ అత్యంత భక్తితో నమస్కరిస్తున్నాను, నమస్కరిస్తున్నాను, నమస్కరిస్తున్నాను.

హే ప్రకటిత 'జ్ఞాని పురుష్', హే సత్పురుషులారా, ప్రస్తుతం భగభగ మండే అగ్నిజ్వాలలో మండుతున్న జగత్కళ్యాణం జరుగుగాక, జగత్కళ్యాణం జరుగుగాక, జగత్కళ్యాణం జరుగుగాక. అందులో నిమిత్తునిగా అవటం కోసం శుద్ధ భావనతో మీ సమక్షంలో మనోవాక్కాయకర్మలతో ఏకాగ్రతతో ప్రార్థన విధిని చేస్తాను. అది అత్యంత సఫలం అవుగాక, సఫలం అవుగాక, సఫలం అవుగాక.

హే దాదా భగవాన్! మీ శుద్ధ జ్ఞానంలో అవలోకనం జరిగిన, మీ శ్రీముఖం నుంచి వెలువడిన శుద్ధ జ్ఞానసూత్రాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:-

"మనోవాక్కాయకర్మలతో కలిగే లేపిత భావాలన్నిటితో 'శుద్ధ చేతన' సర్వదా నిర్లేపమయ్యేవుంది." (3)

"మనోవాక్కాయకర్మలతో కూడిన క్రియలతో 'శుద్ధ చేతన' పూర్తిగా విడిగానే ఉంది." (3)

“మనోవాక్కాయకర్మల అలవాట్లు, వాటి స్వభావాలు ‘శుద్ధ చేతన’ ఎరుకలో ఉన్నాయి. ఎందుకంటే అది స్వ-పర ప్రకాశం. (3)

“ఆహారం తినేవారు ఆహారం తింటారు, నిరాహార ‘శుద్ధ చేతన’ ను కేవలం ఎరిగివుంటాడు.” (3)

“స్థూల సంయోగము, సూక్ష్మ సంయోగము, వాణీ సంయోగంలో ఉంది, పరాధీనమైవుంది. ‘శుద్ధ చేతన’ దానికి కేవలం జ్ఞాత ద్రష్ట మాత్రమే” (3)

“స్థూలతమం నుంచి సూక్ష్మతమం వరకు ప్రాపంచిక అవస్థలన్నిటికీ ‘శుద్ధ చేతన” కేవలం జ్ఞాత ద్రష్ట మాత్రమే” (3)

“మనోవాక్కాయకర్మల అవస్థలు కేవలం ప్రకృతి రచనలే () దానికి ఎవరి బాబూ లేదు రచించేవాడు. అది వ్యవస్థితం. (3)

“నిశ్చేతన, చేతనల ఒక్క గుణం కూడా ‘శుద్ధ చేతన’లో లేదు,‘శుద్ధ చేతన’లోని ఒక్క గుణమూ నిశ్చేతన, చేతనలలో లేదు. రెండూ సర్వదా వేరువేరు.” (3)

“చంచల భాగమైన భావమంతా నిశ్చేతన చేతన భావాలు. అచలమైన ‘శుద్ధ చేతన దాని భావం కాదు.” (3)

హే ప్రభూ! చిత్తభ్రమ వలన నాకు ‘శుద్ధ చేతన’ భావం పైన చెప్పిన సూత్రాల ప్రకారం ‘ఇదే’ అని కచ్చితంగా ఉన్నది ఉన్నట్లుగా అర్థం కాలేదు. ఎందుకంటే నిష్పక్షంగా నన్ను నేను గమనించుకుంటే అర్థమైంది ఏమిటంటే, అంత:క్లేశాలు, కథాపా-అజపా పోలేదు. హే ప్రభూ! అందువలన నా అంత:క్లేశాల నాశనం కోసం నాకు పరమ శక్తిని ప్రసాదించండి. ఇక ఈ పదాల భావాన్ని యథాతథంగా అర్థం చేసుకోవటం తప్ప మరే కోరికా లేదు. నేను కేవలం మోక్ష కామినే. అందువలన నా

ధృఢమైన అభిలాష, 'సత్పురుషుల' పట్ల 'వినయం' తో, 'జ్ఞాని పురుష్' పట్ల 'పరమ వినయం' తో నాకేమీ తెలియదు అన్న భావంలో ఉండటమే.

పైన చెప్పిన జ్ఞాన సూత్రాల శుద్ధ భావం నా శ్రద్ధలో రావటం లేదు, నా జ్ఞానంలోను రావటం లేదు. ఆ భావం నా ధృఢ శ్రద్ధలో వస్తేనే నిజమైన సమ్యక్ దర్శనం జరిగిందనే అనుభవంలో ఉంటాను. అందుకోసం ముఖ్యంగా రెండే విషయాల అవసరం ఉంది:-

1. 'నేను పరమ సత్యాన్ని తెలుసుకునే కోరికనే కలిగివున్నాను' అనే భావ నిష్ఠ.

2. 'పరమ సత్యం' 'జ్ఞాని పురుష్' ఆజ్ఞను సంపూర్ణారాధన చేస్తేనే ప్రాప్తిస్తుంది.

'జ్ఞాని పురుష్' ప్రత్యక్ష యోగం తప్ప వేరే మార్గమేదీ లేదు. అందువలన నేను ప్రత్యక్ష జ్ఞాని పురుష్ అన్వేషణలో ఉంటాను. వారి యోగ ప్రాప్తి తర్వాత నేను, వారి ఆజ్ఞ ఆరాధనలోనే ఉండేందుకు ధృఢ నిశ్చయం నిర్ణయం చేసుకుంటాను. ఈ నా కోరిక సఫలమౌగాక, సఫలమౌగాక, సఫలమౌగాక.

(బ్రాకెట్‌లో ఇచ్చిన సంఖ్య ప్రకారం, అన్నిసార్లు రోజుకోసారి చదవండి)

# తెలుగులో దాదా భగవాన్ పుస్తకాలు

| | |
|---|---|
| 1. | అన్ని చోట్లా సర్దుబాటు |
| 2. | విభేదాలను తొలగించడానికి |
| 3. | ఎలాగైనా జస్టిస్ జరిగింది |
| 4. | బాధితుడు తప్పిదము |
| 5. | క్రోధం |
| 6. | చింత |
| 7. | నేను ఎవరు? |
| 8. | భావనతో మెరుగుపడతాయి జన్మ-జన్మలు |
| 9. | మృత్యు సమయం దానికి ముందు, దాని తర్వాత... |
| 10. | ఆత్మ సాక్షాత్కారం |
| 11. | మానవ ధర్మం |
| 12. | సేవ, పరోపకారం |
| 13. | ప్రతిక్రమణ |
| 14. | భార్యాభర్తల దివ్య వ్యవహారం |
| 15. | అంతఃకరణ స్వరూపం |


❖ తెలుగులో మరిన్ని పుస్తకాలు జోడించబడుతున్నాయి మరియు త్వరలో అందుబాటులోకి వస్తాయి.

❖ Dada Bhagwan books are available in different languages: Gujarati, Hindi, English, Marathi, Telugu, Kannada, Oriya, Malayalam, Bengali, Punjabi, Assamese, Tamil, German, Spanish, Russian, etc.

❖ 'Dadavani' Magazine is published every month in three languages: Gujarati, Hindi & English.

❖ All Dada Bhagwan books and magazines are also available on online book store : https://store.dadabhagwan.org

# దాదా భగవాన్ ఫౌండేషన్ తెలుగు యూట్యూబ్ ఛానల్




- ❖ ఇది అడాలజ్ దాదా భగవాన్ ఫౌండేషన్ యొక్క అధికారిక తెలుగు యూట్యూబ్ ఛానెల్.
- ❖ దిగువ లింక్ నుండి తెలుగు భాషలో సత్సంగ వీడియోలను చూడండి.

**'Dada Bhagwan Foundation Telugu' Channel:**

https://dbf.adalaj.org/yttelugu

*Open Link OR*

*Scan QR*

---

*Dada Bhagwan Foundation Youtube video channels are available in other regional languages: Gujarati, Hindi, Marathi, Bengali, Tamil, Telugu, Kannada, Malayalam, Spanish, Portuguese, etc.*

# Persons to Contact

## Dada Bhagwan Foundation

**Adalaj** : **Trimandir**, Simandhar City, Ahmedabad-Kalol Highway
P/O: Adalaj, Dist. Gandhinagar - 382421, Gujarat, India.
Tel: +91-9328661166 / 9328661177
E-mail : info@dadabhagwan.org

**Mumbai** : **Trimandir**, Rushivan, Kajupada, Borivali (E)
Tel: +91-9323528901

| | | | |
|---|---|---|---|
| **Kolkata:** | 9830093230 | **Delhi:** | 9810098564 |
| **Jaipur:** | 9351408285 | **Chennai:** | 7200740000 |
| **Bhopal:** | 9425024405 | **Patna:** | 7352723132 |
| **Indore:** | 9039936173 | **Amravati:** | 9422915064 |
| **Raipur:** | 9329644433 | **Bangalore:** | 9590979099 |
| **Chandigarh:** | 9780732237 | **Hyderabad:** | 9989877786 |
| **Kanpur:** | 9452525981 | **Pune:** | 9422660497 |
| **Bhubaneswar:** | 8763073111 | **Jalandhar**: | 9814063043 |
| **Varanasi:** | 9795228541 | **Sangli:** | 9423870798 |

| | |
|---|---|
| **USA: Dada Bhagwan Vignan Institute**<br>Tel: + 1-877-505-DADA (3232)<br>Email: info@us.dadabhagwan.org | **U.K: Dada Darshan (UK)**<br>Tel: +44 330-111-DADA (3232)<br>Email: info@uk.dadabhagwan.org |
| **Germany** : +49 700 32327474<br>**UAE** : +97 1557316937<br>**Kenya** : +25 4722722063<br>**Dubai** : +971 501364530 | **Australia** : +61 421127947<br>**Singapore** : +65 81129229<br>**New Zealand** : +64 210376434 |

Website : www.dadabhagwan.org



## జీవన ధ్యేయం

ఈ ప్రపంచం మీకు నచ్చినట్లయితే, ఆ తర్వాత మీకు అర్థం చేసుకునే అవసరం ఏమీ లేదు. కాని, ఈ ప్రపంచం మీకు చికాకు కలిగిస్తుంటే, ఆధ్యాత్మికాన్ని తెలుసుకునే అవసరం ఉంటుంది. ఆధ్యాత్మికంలో, 'స్వస్వరూపం' తెలుసుకోవలసిన అవసరం ఉంది. 'నేనెవరు' అన్నది తెలుసుకుంటే, పజిల్ అంతా సాల్వ్ అయిపోతుంది.

–దాదాశ్రీ

मूल दीपक से प्रकटे दीपमाला

dadabhagwan.org

9 789391 375775

Printed in India

Price ₹40